


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 311 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 13 జూలై 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE :311 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 13 JULY 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## విజయవాడలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి

- విజయవాడ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం
- అగ్నికి ఆహుతైన ఏడు ప్రైవేట్ బస్సులు
- మెకానిక్ షెడ్‌లో మొదలైన మంటలు
- ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ఘటనపై కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు

పెన్ పవర్ డెస్క్:నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్ర మాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సులకు మంటలు అంటుకో వడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్ లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా

- మిగతా 2లో





## పవన్ కల్యాణ్ రెండో చేతికీ సమస్య ఉంది

- ముంబై వెళ్లి పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు...
- భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ముంబయి ఆసుపత్రిలో పవన్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు
- పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి
- మూడున్నర గంటల పాటు సాగిన సంక్లిష్టమైన శస్త్రచికిత్స
- సినిమా షూటింగుల్లో అయిన పాత గాయాలతో బాధపడుతున్న పవన్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ముంబై వెళ్లి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్, ప్రస్తుతం ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొద్దిసేపటి క్రితం ఆసుపత్రికి చేరుకున్న చంద్రబాబు,

- మిగతా 2లో






## విశాఖకు జగన్.. షెడ్యూల్ ఖరారు

- విశాఖకు జగన్.. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత
- ఈ నెల 14న విశాఖకు వెళ్లనున్న జగన్
- బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు పరామర్శ
- ప్రభుత్వ వైఫల్యంపై తీవ్రస్థాయిలో మండిపడ్డ వైసీపీ నేతలు
- సీఎం, డిప్యూటీ సీఎం మౌనంపై వైసీపీ విమర్శలు
- ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడితోనూ జగన్ భేటీ

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ విశాఖప ట్నంలో పర్యటిం చనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన

- మిగతా 2లో

## వియత్నాం పడవ ప్రమాదం.. సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా

పెన్ పవర్ డెస్క్: వియత్నాం పడవ ప్రమాద బాధితులకు అందుతున్న సహాయకచర్యలపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. వారిని స్వస్థలాలకు తీసుకు వచ్చేందుకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన గెల్లె కిశోర్ ప్రస్తుతం వియత్నాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు

- మిగతా 2లో





## ఇక సెలవు..

అధికారిక లాంఛనాలతో ముగిసిన లెజెండరీ సింగర్ జానకి అంత్యక్రియలు

- మైసూరులో ప్రభుత్వ లాంఛనాలతో ఎస్. జానకి అంత్యక్రియలు
- హెచ్‌డీ కోటె తాలూకాలోని ఫామ్‌హౌస్‌లో ముగిసిన అంతిమ సంస్కారాలు
- మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో పార్థివదేహానికి నివాళులర్పించిన ప్రముఖులు
- వేలాదిగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికిన అభిమానులు

పెన్ పవర్ డెస్క్: సంగీత శిఖరం, లెజెండరీ ప్లే బ్యాక్ సింగర్ ఎస్. జానకి అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ ముగిశాయి. ఆదివారం (జులై 12) సాయంత్రం మైసూరు సమీపంలోని కనియనహుండి దగ్గర కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జానకమ్మ అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. మనువరాలు అప్సర వైద్యుల జానకమ్మ

- మిగతా 2లో

## మరోసారి భగ్గుమన్న పశ్చిమాసియా అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు

ఇరాన్ ప్రతీకార చర్యలు... అమెరికా స్థావరాలపై భీకర దాడులు, హర్మూజ్ మూసివేత

- జోర్డాన్, ఖతార్, ఒమన్‌లోని యూఎస్ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు
- హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ప్రకటన
- తమపై దాడులు పునరావృతమైతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిక

- మిగతా 2లో




## ప్రశ్నించే గొంతులమీద తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్ళకి నా సమాధానం ఇదే

- విమర్శకులపై వీడియో పోస్ట్ చేసిన నటుడు ప్రకాశ్ రాజ్
- 'దిగజారండి' అంటూ వ్యంగ్యంగా స్పందించిన వైనం
- జనసైనికులు, కొన్ని ఛానళ్లను టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు
- అబద్ధాలు, కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ

ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరని స్పష్టం

- మిగతా 2లో



## షాబాద్ ఆరు హత్యల కేసు.. నిందితుడి కోసం 12 బృందాలతో గాలింపు

### నిందితుడి ఆచూకీ తెలిపితే రూ.2 లక్షల బహుమతి

పెన్ పవర్ డెస్క్:రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. గాలింపు బృందాల సంఖ్యను 10 నుంచి 12కు పెంచారు. నిందితుడి కదలికలను గుర్తించేందుకు అతడు ఉపయోగించిన సిమ్ కార్డులతో పాటు బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండొచ్చనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్లే హైవేలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. 44వ నంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటళు ,, దాబాలు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.

- మిగతా 2లో



## సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు.. గుంటూరులో వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్

- వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అరెస్ట్
- గుంటూరులోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు
- సీఎం రేవంత్‌రెడ్డిపై టీవీ డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలే కారణమని సమాచారం
- రేవంత్‌ను "జొమాటో డెలివరీ బాయ్" అంటూ తీవ్ర విమర్శలు
- ముందస్తు నోటీసులు లేకుండా అరెస్ట్ చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ




- మిగతా 2లో




# మళ్లీ దాడులు

హోర్ముజ్ జలసంధిలో కంటైనర్ నౌకపై ఇరాన్ దాడి చేసిన ఘటనతో ఉద్రిక్తత మరోసారి తీవ్రరూపం దాల్చింది. ఆ దాడిలో నౌకకు మంటలు అంటుకోవడంతో సిబ్బంది దాన్ని వదిలి బయటకు రావాల్సి వచ్చింది. దీనికి ప్రతిగా ఆదివారం తెల్లవారుజామున అమెరికా ఇరాన్‌పై భారీ వైమానిక దాడులు చేసింది. అనంతరం ఇరాన్ బహ్రెయిన్, కువైట్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు సమాచారం.

**140 లక్ష్యాలపై అమెరికా దాడులు...**

ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధానికి శాశ్వత ముగింపు దిశగా అమెరికా-ఇరాన్ మధ్య జరిగే చర్చల్లో హోర్ముజ్ జలసంధి ప్రధాన వివాదాంశంగా మారింది. యుద్ధానికి ముందు ప్రపంచంలో వ్యాపారానికి వచ్చే చమురు, సహజవాయువులో దాదాపు ఐదో వంతు ఈ జలసంధి గుండా రవాణా అయ్యేది. యుద్ధ సమయంలో ఈ మార్గంపై ఇరాన్ ఆధిపత్యం వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభం తలెత్తింది. అయితే బ్యారెల్‌కు 120 డాలర్ల వరకు చేరిన చమురు ధరలు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి.అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ దాడుల్లో సుమారు 140 లక్ష్యాలను ఛేదించారు. గత రెండు విడతల దాడులతో పోలిస్తే ఇది మరింత విస్తృతంగా సాగింది. క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి నిల్వలు, సమాచార వ్యవస్థలు, ఇతర సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించారు.

**హోర్ముజ్ జలసంధిలో...**

హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై ఇరాన్ దాడి చేసే సామర్థ్యాన్ని ఈ చర్యలు దెబ్బతీస్తాయని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది.ఇరాన్ యుద్ధంపై తాత్కాలిక ఒప్పందం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన కొద్ది రోజులకే ఈ తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సామాజిక మాధ్యమం ద్వారా స్పందిస్తూ, "ఇరాన్ తప్పు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు దాని మూల్యం చెల్లించుకోవాల్సిందే" అని వ్యాఖ్యానించారు.దీనికి ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, ప్రధాన చర్చల ప్రతినిధి మొహమ్మద్ బాఘెర్ ఖలీబఫ్ స్పందించారు."ఏకపక్ష ఒప్పందాల కాలం ముగిసింది. మాట నిలబెట్టుకోండి, లేకపోతే మూల్యం చెల్లించండి అని ముందే చెప్పాం. ఇప్పుడు వాస్తవం మీ ముందుకొచ్చింది" అని ఆయన ఎక్స్‌లో రాశారు.

**గల్ఫ్ దేశాల్లో అప్రమత్తత...**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ క్షిపణి, డ్రోన్ దాడులపై ప్రజలను అప్రమత్తం చేసింది. అదే సమయంలో సమీపంలోని ఖతర్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. కొద్దిసేపటికే అక్కడ క్షిపణి హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను అడ్డుకున్నామని ఖతర్ సైన్యం వెల్లడించింది. అమెరికా నౌకాదళం ఐదో దళం స్థావరం ఉన్న బహ్రెయిన్‌లో కూడా క్షిపణి హెచ్చరికలు వినిపించాయి. తమ గగనతలంలోకి వచ్చిన క్షిపణులను అడ్డుకుంటున్నామని కువైట్ సైన్యం తెలిపింది. యూఏఈలో ఏ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నారన్నది వెంటనే స్పష్టత రాలేదు. తాజా దాడుల వరకు ఇరాన్ ఎమిరేట్స్‌ను లక్ష్యంగా చేసుకోలేదు. గత మేలో దేశంలోని ఏకైక అణు విద్యుత్ కేంద్రం సమీపంలో డ్రోన్ దాడితో అగ్నిప్రమాదం సంభవించింది.ఇరాన్ ఇతర ప్రాంతాలపై కూడా దాడులు జరిగాయని ప్రకటించినా వాటిపై స్వతంత్ర నిర్ధారణ రాలేదు.

**హోర్ముజ్ జలసంధిలో నౌకపై దాడి...**

హోర్ముజ్ జలసంధిలో సైప్రస్ జెండాతో ప్రయాణిస్తున్న కంటైనర్ నౌకపై ఇరాన్ దాడి చేసింది. ఇంజిన్ గదికి తీవ్ర నష్టం వాటిల్లిందని, ఓ పౌర సిబ్బంది ఆచూకీ తెలియడం లేదని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది.బ్రిటిష్ సైన్యం పర్యవేక్షిస్తున్న యునైటెడ్ కింగ్‌డమ్ మెరిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం ఆ నౌక ఒమాన్ తీరానికి ఆనుకుని ప్రయాణిస్తోంది. ఇరాన్ ప్రాదేశిక జలాల్లోకి వెళ్లకుండా నౌకలు ఈ మార్గాన్నే ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. మంటలు చెలరేగడంతో సిబ్బంది నౌకను వదిలి బయటకు వచ్చారని తెలిపింది.తమ హెచ్చరికలను పట్టించుకోకుండా అనుమతించిన మార్గంలో ప్రయాణించని పలువురు నౌకలను నిలిపివేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. అందులో ఒక నౌకను హెచ్చరిక కాల్పులతో ఆపినట్లు పేర్కొంది.తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హోర్ముజ్ జలసంధి మూసివేస్తామని ఇరాన్ ప్రకటించింది. మరోసారి దాడులు ఎదురైతే ప్రాంతంలోని శత్రు స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.ఇరాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం బుషెహర్, హోర్మోజ్‌గాన్, ఖుజెస్తాన్, సిస్తాన్-బలూచిస్తాన్ రాష్ట్రాల్లో అమెరికా దాడులు జరిగాయి. నష్టం, మృతుల వివరాలను వెంటనే వెల్లడించలేదు.

**చర్చల తర్వాతే తాజా ఘర్షణలు...**

హోర్ముజ్ జలసంధి అంశంపై ఇరాన్, ఒమాన్ విదేశాంగ మంత్రులు శనివారం సమావేశమయ్యారు. జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడులు, వాటికి అమెరికా ప్రతీకార చర్యల తర్వాత తాత్కాలిక ఒప్పందానికి ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.ఈ జలసంధి ఇరాన్, ఒమాన్ ప్రాదేశిక జలాల్లో ఉన్నప్పటికీ చాలా కాలంగా అంతర్జాతీయ జలమార్గంగా గుర్తింపు పొందింది.హోర్ముజ్ జలసంధి అంశంపై సాంకేతిక, రాజకీయ స్థాయిల్లో చర్చలు కొనసాగించాలని ఇరాన్‌తో అంగీకరించినట్లు ఒమాన్ తెలిపింది. అయితే ఈ జలసంధి అందరికీ అందుబాటులో ఉంటుందన్న విషయంపై ఇరాన్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా మాత్రం అదే కోరుతోంది.

**ప్రతీకారం తప్పదన్న కొత్త సుప్రీం నేత...**

యుద్ధం మొదలైనప్పటి నుంచి బహిరంగంగా కనిపించని ఇరాన్ కొత్త సుప్రీం నేత అయతొల్లా మొజ్తబా ఖమేనీ తన తొలి ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 28న జరిగిన తొలి దాడుల్లో తన తండ్రి అయతొల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తప్పదని పేర్కొన్నారు."ప్రతీకారం తీర్చుకోవడం మా దేశ సంకల్పం. అది తప్పకుండా అమలు చేస్తాం" అని ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసిన ప్రకటనలో తెలిపారు.

**ఇరాన్‌లో నిర్ణయాలు ఎవరి చేతిలో?**

తాజా దాడులకు ముందే యుద్ధ విరమణను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఇరాన్‌లోని కఠినవాద వర్గం స్వతంత్రంగా వ్యవహరిస్తోందని అమెరికా అధికారులు పేర్లు వెల్లడించకుండా శుక్రవారం తెలిపారు.అయితే కొత్త సుప్రీం నేత నాయకత్వంలో దేశం ఏకతాటిపై ఉందని ఇరాన్ స్పష్టం చేసింది.గురువారం అమెరికా దాడులు ముగిసిన తర్వాత కూడా ఇరాన్‌పై మరికొన్ని దాడులు జరిగాయి. వాటి వెనుక ఎవరున్నారన్నది స్పష్టత రాలేదు.ఆ దాడుల బాధ్యతను ఇజ్రాయెల్ ప్రకటించలేదు. ఇరాన్ మళ్లీ తమపై దాడులు చేయకుండా అడ్డుకునేందుకు గల్ఫ్ అరబ్ దేశాలే ఈ చర్యలకు పాల్పడి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గురువారం అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతర్‌లపై దాడులు చేసింది.

# పశ్చిమ బెంగాల్‌కు ఉజ్వల భవిష్యత్తు.. సీఎం చంద్రబాబు నాయుడు ధీమా!

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థవంతమైన నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయంగా అపారమైన గౌరవాన్ని సంపాదించుకుందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. ముంబై పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆర్థిక మందగమనాన్ని, సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, భారతదేశం మాత్రం అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ నాయకత్వం వల్లే ఇది సాధ్యమవుతోందని హర్షం వ్యక్తం చేసిన ఆయన.. 2047 నాటికి భారతదేశం ఖచ్చితంగా పూర్తి స్థాయిలో 'అభివృద్ధి చెందిన దేశం' (ఐవవజవశ్రీశీజూవస చీఅశీఅ) గా అవతరిస్తుందనే పూర్తి నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు.ఇదే సమయంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అమలు కాబోతున్న యూనిఫాం సివిల్ కోడ్ (ఖజజ) పరిణామాలపై చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా మూసుకుపోయిన పశ్చిమ బెంగాల్ అభివృద్ధి తలుపులు ఇప్పుడు తెరుచుకున్నాయని (ఖఅశ్రీశీషఎవం) ఆయన వ్యాఖ్యానించారు. "గతంలో 'బెంగాల్ ఈ రోజు ఆలోచించేది.. దేశం రేపు ఆలోచిస్తుంది' అనే ఒక సామెత ఉండేదని, కానీ ఈ మధ్య కాలంలో బెంగాల్ ఆలోచించడం మానేసిందని.. అయితే ఇప్పుడు మళ్లీ ఆలోచించడం మొదలుపెట్టిందని" పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అపారమైన మానవ వనరులు, అవకాశాలు ఉన్నాయని.. రాబోయే రోజుల్లో ఆ రాష్ట్ర భవిష్యత్తు అత్యంత ఉజ్వలంగా, ప్రకాశవంతంగా మారబోతోందని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# ప్రశ్నించే గొంతులమీద తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్ళకి నా సమాధానం ఇదే

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తనపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై తీవ్రస్థాయిలో, వ్యంగ్యంగా స్పందించారు. 'దిగజారండి' అంటూ విమర్శకులను ఉద్దేశించి ఓ వీడియో పోస్ట్ చేశారు. తాను మౌనంగా లేనని, అన్నీ గమనిస్తున్నానని చెబుతూ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు."నేను మౌనంగా లేను. అన్నీ చూస్తున్నా. ఎమ్మెల్యేలు, ఎంపీలు, వాళ్ల పలుకుబడితో జనసైనికులు, కొందరికి అమ్ముడుపోయిన చానళ్లు, యూట్యూబర్లు... సోషల్ మీడియాలో మీ అబద్ధాలు, మీరు అల్లుతున్న కట్టుకథలు, మీ బూతులు అన్నీ వింటున్నా. మీ అందరికీ నా సమాధానం ఒక్కటే.. దిగజారండి... దిగజారండి... దిగజారుతూనే ఉండండి. ఇది మీ దిగజారుడుతనానికి ఆరంభం మాత్రమే. మొత్తం ప్రపంచం మీ దిగజారుడుతనాన్ని చూస్తోంది. అయితే, దిగజారడం అనే సామర్థ్యంపై మీకున్న నమ్మకాన్ని మాత్రం దిగజారనివ్వకండి. కాస్త గట్టిగా దిగజారండి...

అరుస్తూ దిగజారండి... నాలుగు వైపుల నుంచి దిగజారండి... సిగ్గులేకుండా దిగజారండి. దిగజారడంలో మీకు మీరే సాటి అనే గర్వంతో దిగజారండి. ఎంత చేసినా ప్రశ్నించే గొంతుకలను మాత్రం ఆపలేరు. మీ పని మీరు కానివ్వండి... దిగజారుతూనే ఉండండి.. జస్ట్ ఆస్కింగ్.." అంటూ తన వీడియోను ముగించారు. ప్రకాశ్ రాజ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# మరోసారి భగ్గుమన్న పశ్చిమాసియా అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ దేశ దక్షిణ ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్, ఖతార్, ఒమన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతటితో ఆగకుండా హర్మూజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది.తమ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ ద్వారా ఐఆర్జీసీ ఈ వివరాలు వెల్లడించింది. తమ దక్షిణ తీరప్రాంతాల్లోని పలు సైనిక స్థావరాలు, కమ్యూనికేషన్ టవర్లపై యూఎస్ వైమానిక దాడులు చేసిందని పేర్కొంది. దీనికి ప్రతీకారంగా మూడు దశల్లో దాడులు చేశామని తెలిపింది. మొదటి దశలో జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని, అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ల హ్యాంగర్‌ను ధ్వంసం చేశామని వివరించింది.

రెండో దశలో ఖతార్‌లోని అల్ ఉదెయిద్ ఎయిర్‌బేస్‌పై దాడి చేసి, కమాండ్ సెంటర్‌తో పాటు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ కేంద్రాలను ధ్వంసం చేశామని పేర్కొంది. మూడో దశలో ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో ఉన్న అమెరికా లాజిస్టికల్ కేంద్రాలపై భారీ దాడి చేశామని తెలిపింది. ఇరాన్ సైన్యం కూడా కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై కమికాజే డ్రోన్లతో దాడులు చేసిందని, రాడార్ సైట్లు, ఆయుధ డిపోలను ధ్వంసం చేసిందని వెల్లడించింది. అమెరికా మళ్లీ దాడులకు పాల్పడితే మరింత తీవ్రమైన ప్రతిచర్యలు ఉంటాయని ఐఆర్జీసీ హెచ్చరించింది. అమెరికా జోక్యం ఆగే వరకు హర్మూజ్ జలసంధి మీదుగా ఏ నౌకనూ అనుమతించబోమని స్పష్టం చేసింది.

# సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు.. గుంటూరులో వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు.

ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే, సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నాగార్జున యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న తెలంగాణ పోలీసులు ఆదివారం గుంటూరుకు చేరుకున్నారు. నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.అనంతరం, తమ వివరాలను, అరెస్ట్ సమాచారాన్ని స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తామని చెప్పి ఆయన్ను తమతో తీసుకెళ్లారు. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ నేతను, మరో రాష్ట్ర పోలీసులు వచ్చి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది..

ఇటీవల ఒక టీవీ ఛానల్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డిని 'జొమాటో డెలివరీ బాయ్' అని సంబోధిస్తూ, ఆయన జీవోలను కూడా సరిగా చదవరని ఆరోపించారు.

ఎమ్మెల్యేగా కూడా రేవంత్ సమర్థంగా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల కారణంగానే ఆయనపై కేసు నమోదై, అరెస్ట్ జరిగిట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని తెలంగాణ కాంగ్రెస్ కూడా నిర్ధారించింది.

# పవన్ కల్యాణ్ రెండో చేతికీ సమస్య ఉంది

- మొదటి పేజి తరువాయి

పవన్ కల్యాణ్‌తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నారాయణ కూడా పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ చాలాకాలంగా భుజం నొప్పితో ఇబ్బంది పడుతున్నారు. సినిమా షూటింగుల సమయంలో అయిన పాత గాయాలు ఇప్పుడు తీవ్రం కావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవలి ఎన్నికల ప్రచార సమయంలో కూడా తీవ్రమైన నొప్పిని భరిస్తూనే ఆయన కూటమి తరఫున ప్రచారం నిర్వహించారు.ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో వైద్యుల బృందం పవన్ కల్యాణ్‌కు సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. ఇటీవలే సైనస్ సమస్యకు కూడా ఆయన ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. తాజాగా భుజం శస్త్రచికిత్స అనంతరం పవన్ కల్యాణ్ కోలుకుంటున్నారు.

# వియత్నాం పడవ ప్రమాదం.. సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా

- మొదటి పేజి తరువాయి

అధికారులు తెలిపారు. ఆయన ఆరోగ్యం క్రమంగా కుదుటపడుతోందని వివరించారు. మరోవైపు మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ఒక ఏజెన్సీని నియమించినట్టు అధికారులు వెల్లడించారు. భౌతికకాయాల అప్పగింత, తరలింపు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన పర్యాటకులను ఇవాళ విమానాల ద్వారా తమ స్వస్థలాలకు తరలించేలా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. బాధిత వ్యక్తులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చే వరకు,

మృతుల భౌతిక కాయాల తరలింపు ప్రక్రియ పూర్తిగా ముగిసే వరకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలని ఏపీ భవన్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ తరలింపు ప్రక్రియపై అక్కడి భారత ఎంబసీతో సమన్వయం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు.

# విజయవాడలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి

- మొదటి పేజి తరువాయి

మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

## విశాఖకు జగన్.. షెడ్యూల్ ఖరారు

- మొదటి పేజి తరువాయి

జగన్ పర్యటన ఖరారైంది.ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు.ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు.గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు.

జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

## ఇక సెలవు..

- మొదటి పేజి తరువాయి

చితికి నిప్పంటించారు. తన మధురమైన స్వరంతో భారత సినీ సంగీత ప్రపంచాన్ని దశాబ్దాల పాటు ఓలలాడించిన గానకోకిలను కడసారి చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. భౌతికంగా జానకమ్మ మన నుంచి దూరమైనా.. పాటల రూపంలో ఆమె మనతో ఉంటారని స్మరించుకున్నారు. అంతకముందు జానకమ్మ భౌతికకాయాన్ని అభిమానుల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్?లో ఉంచగా సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు హాజరై నివాళులర్పించారు.

**గాన కోకిల కన్నుమూత:**

సినీ సంగీత పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. లెజెండరీ సింగర్, గానకోకిల ఎస్. జానకి గొంతు మూగబోయింది. గతకొంత కాలంగా వయోభారం, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధ పడుతోన్న ఆమె మైసూర్?లోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం (జులై 11) కన్నుమూశారు.జానకి మనువరాలు అప్సర వైద్యుల ఇన్స్టాగ్రామ్ వేదికగా ఈ విషయాన్ని ధృవీకరించారు. దీంతో భారతీయ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. తన అద్భుతమైన స్వరంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న గాన కోకిల జానకి మరణంపై పలువురు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు.

ఎస్. జానకి బ్యాగ్రౌండ్:తన మధురమైన గాత్రంతో ఆరు దశాబ్దాల పాటు కోట్ల మంది శ్రోతలను మైమరపించిన గానకోకిల, దక్షిణ భారత నైటింగేల్ ఎస్. జానకి 1938, ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్లోని గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించారు. ఏ విధమైన శాస్త్రీయ సంగీతం నేర్చుకోకుండానే తన అద్భుత స్వరంతో ఆరు దశాబ్ధాల పాటు సంగీత పరిశ్రమను ఏలారు. 1957లో తమిళ చిత్రం ద్వారా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె.. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీతో పాటు దాదాపు 17 భాషల్లో 48 వేలకు పైగా పాటలు పాడి సరికొత్త రికార్డు సృష్టించారు.

తన అద్భుతమైన స్వరంతో 4 జాతీయ అవార్డులు, 32 వేర్వేరు రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు సాధించారు. చిన్న పిల్లల గొంతు నుంచి పండు ముసలి వారి వరకు.. ఎలాంటి పాత్రకైనా తన గొంతుతో ప్రాణం పోయడం ఆమె స్పెషాలిటీ. జానకి భౌతికంగా మన మధ్య లేకపోయినా... ఆమె పాడిన వేలాది పాటలు, ఆ మధుర స్వరం సంగీత ప్రియుల గుండెల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

## షాబాద్ ఆరు హత్యల కేసు.. నిందితుడి కోసం 12 బృందాలతో గాలింపు

- మొదటి పేజి తరువాయి

తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో తొలుత బాలిక తల్లి, నానమ్మలను రాజ్‌కుమార్ కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. ఈ ఆరు హత్యలు గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. పరారీలో ఉన్న నిందితుడిని పట్టిస్తే.. రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. ఈ ఘటన అనంతరం పోలీసు ఉన్నతాధికారులు షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేశారు.

# సుదీర్ఘ పోరాటంతో కమ్యూనిస్టు చరిత్ర సువర్ణాక్షరాల్లో లిఖితం

- సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎం. వెంకయ్య
- కందుకూరులో ముగిసిన సిపిఐ జిల్లా సైద్ధాంతిక-రాజకీయ శిక్షణ తరగతులు
- ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కోవడానికి కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపు
- బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సిపిఐ నేతల విమర్శలు






**కందుకూరు పెన్ పవర్, జూలై 12:**
178 సంవత్సరాల సుదీర్ఘ పోరాట గాథతో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించబడిందని సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎం. వెంకయ్య పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలోని స్వర్ణ ప్యాలెస్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సిపిఐ జిల్లా సైద్ధాంతిక-రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్టీ కార్యకర్తలకు ఇటువంటి శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కమ్యూనిస్టు భావజాలాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రొఫెసర్ జమీందార్ మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఆందోళనకరంగా మారాయని విమర్శించారు. ప్రచారంలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పినా, వాస్తవ పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల పట్ల దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతోందని, ప్రజల తీర్పు త్వరలోనే స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కేంద్ర విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలపడం వల్ల ప్రజలకు నష్టం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కమ్యూనిస్టు పార్టీ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్. వెంకట్రావు మాట్లాడుతూ, పార్టీ నిర్మాణం, కమ్యూనిస్టు సిద్ధాంతాలు, ప్రజా ఉద్యమాల చరిత్రపై కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించడమే ఈ శిక్షణా తరగతుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కందుకూరులో శిక్షణా తరగతులను విజయవంతంగా నిర్వహించిన స్థానిక సిపిఐ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కమ్యూనిస్టు ఉద్యమం మరింత బలోపేతం కావాలని, రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. శిక్షణా తరగతులను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# వీరాంజనేయ స్వామి ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ జూలై 12**
గిద్దలూరు మండలం వెంగళరెడ్డిపల్లె గ్రామంలో శ్రీ వీరాంజనేయ స్వామి వారి ధ్వజ ప్రతిష్ఠ తిరునాళ్ల మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కు వేదాశీర్వచనాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ ప్రజలు, భక్తులు ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు .అంతకు ముందు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గ్రామ ప్రజలందరికీ శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, తిరునాళ్ల మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను, గ్రామ పెద్దలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటుగా ఎడమకంటి సుధాకర్ రెడ్డి, ఎడమకంటి రంగస్వామిరెడ్డి, సొసైటీ బ్యాంక్ త్రీ మెన్ కమిటీ డైరెక్టర్ బద్రి గోపాల్ రెడ్డి, పిడతల రమేష్ రెడ్డి,గిద్దలూరు మండల క్లస్టర్ ఇంచార్జ్ కంకర వెంకట రెడ్డి,పార్షా రామ లింగ స్వామి, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు , గ్రామ పెద్దలు ,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి చేతుల మీదుగా "మన భారతీయ నైతిక విలువలు" పుస్తకావిష్కరణ

**పెన్ పవర్ సింగరాయకొండ,జరుగుమల్లి జూలై 12:**
ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, పాత సింగరాయకొండ పంచాయతీ, గవదగట్లవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న అర్రిబోయిన రాంబాబు సంకలనం చేసిన "మన భారతీయ నైతిక విలువలు" పుస్తకాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గారు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వ వికాసం ప్రాథమిక స్థాయి నుంచే పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు రామాయణం, మహాభారతం, భాగవతం వంటి భారతీయ ఇతిహాసాలు, పురాణాలలోని స్ఫూర్తిదాయకమైన కథలను విద్యార్థులకు బోధించాలని సూచించారు. ప్రభుత్వం కూడా ప్రముఖ ప్రవచనకారులు చాగంటి కోటేశ్వరరావు,గరికపాటి నరసింహారావు వంటి వారి ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక నైతిక విలువల తరగతులు నిర్వహించేందుకు కృషి చేస్తోందని తెలుపుతూ రాంబాబును అభినందించారు. పుస్తక రచయిత అర్రిబోయిన రాంబాబు మాట్లాడుతూ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు డోలా సువర్ణ పద్మావతి గారి మార్గదర్శకత్వంలో భారతీయ ఇతిహాసాల్లోని నైతిక విలువలను ఆధారంగా చేసుకుని 20 కథలతో ఈ పుస్తకాన్ని రూపొందించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారుల్లో చిన్న వయస్సు నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ అలవడేలా రంగురంగుల చిత్రాలతో కూడిన కథలను పుస్తకంలో పొందుపరిచామని తెలిపారు. ఈ పుస్తకాన్ని మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరింపజేయడం తన జీవితంలో ఒక చిరస్మరణీయ ఘట్టమని, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబటి బ్రహ్మయ్య, ప్రసాద్, రాంబాబు, జనసేన నాయకులు ఐనాబత్తిన రాజేశ్, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.




# నేడే ఎమ్మెల్యే అశోకుడి ప్రజాదర్బార్



**గిద్దలూరు పెన్ పవర్ జూలై 12**
గిద్దలూరు పట్టణం లో ని తెలుగు దేశం పార్టి కార్యాలయంలో సోమవారం ఉదయం 10:00 గంటలకు గిద్దలూరు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి " ప్రజా దర్బార్ " కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజా సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా తెలుసుకొని అర్జీలను స్వీకరిస్తారు. కావున గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలు అర్జీ రూపంలో ఎమ్మెల్యే అందజేసీ సమస్యలను పరిష్కరించుకోవాలని ఈకార్యక్రమను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది. సమర్పించే అర్జీ పై తప్పనిసరిగా ఆధార్ నెంబర్ ఫోన్ నెంబర్ వేయాలని తెలిపారు. ఇదిలాఉండగా ఉదయం 10:30 గం " ని లకు గిద్దలూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలోని శ్రీనివాస నగర్ నందు 66 లక్షల రూపాయల నిధులతో 4 సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయుటకు అభివృద్ధి పనులకు భూమి పూజా కార్యక్రమములో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

# నూతన గృహ ప్రవేశ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ జూలై 12**
గిద్దలూరు మండలం పొదలకొండపల్లి గ్రామానికి చెందిన చేరెడ్డి రమణా రెడ్డి , మాధవి దంపతుల నూతన గృహ ప్రవేశ మహోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, గృహం సుఖశాంతులు, ఐశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గిద్దలూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు మరియు అభిమానులు పాల్గొన్నారు.



# "మినరల్" పేరుతో మోసం!

## జోరుగా సాగుతున్న బోరు నీళ్ల వ్యాపారం

## పట్టించుకోని అధికార గణం




**పొదిలి, పెన్ పవర్, జూలై 12**
పొదిలిలో మినరల్ పేరుతో మోసం జరుగుతోంది. లాభాపేక్షకు అలవాటు పడిన కొందరు మినరల్ వాటర్ పేరుతో ప్రజలకు బోరు నీళ్లనే అంటగడుతున్నారు. గచ్చంతరం లేక ప్రజలు డబ్బులు ఇచ్చి మరి బోరు నీళ్లనే వినియోగించుకోవాల్సి వస్తుంది. పొదిలిలో బోరు నీళ్ల వ్యాపారం జోరుగా సాగుతూ ఉండటంతో పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్ లు వెలుస్తున్నాయి. మినరల్ వాటర్ సరఫరాకు పాటించాల్సిన నిబంధనలను గాలికి వదిలేసి, బోరు నీళ్లనే ప్రజలకు అంటగడుతూ, తమ జేబులు నింపుకుంటున్నారు. ఆ యా బోరు నీళ్లను త్రాగిన ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తుందని పలువురు ఆక్షేపిస్తున్నారు. పొదిలిలో బోరు నీటి వ్యాపారం లాభసాటిగా మారడంతో పలువురు ఈ వ్యాపారం పైనే దృష్టి సారిస్తున్నారు. పరిస్థితి ఈ విధంగా ఉన్నప్పటికీ అరికట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సురక్షితమైన నీరు అందించాలనే ప్రభుత్వ ఆశయం ఇటువంటి వ్యాపారుల వల్ల నీరు గారిపోతుందనే విమర్శలు సైతం జోరుగా వినిపిస్తున్నాయి. పొదిలిలో నీటి వ్యాపారం చేసే వ్యాపారులు అనతి కాలంలోనే ధనవంతుల జాబితాలో చేరిపోతున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. పొదిలిలో నగరపాలక సమస్త ఉన్నప్పటికీ, ఇటువంటి కల్తీ నీటి వ్యాపారం పై దృష్టి సారించకపోవడం పట్ల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పొదిలిలో జరుగుతున్న బోరు నీటి వ్యాపారం పై దృష్టి సారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# ఆత్మీయ కలయికలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్






**కందుకూరు పెన్ పవర్, జూలై 12**
కడప కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో 1997--2001లో తన తోటి ఇంజనీరింగ్ చదివిన మిత్రులతో 25 సంవత్సరాల అనంతరం ఆదివారం మళ్లీ కళాశాల ప్రాంగణంలో కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ ఆత్మీయ కలయిక ఎన్నో మధుర జ్ఞాపకాలను మళ్లీ మనసులో మెదిలించిందని,ఒకప్పుడు కలిసి గడిపిన విద్యార్థి దశ, క్లాస్‌రూమ్‌లోని అనుభవాలు, క్యాంటీన్‌లోని సందడి, పరీక్షల ముందు పడిన టెన్షన్, పంచుకున్న నవ్వులు అన్నీ మరోసారి కళ్లముందు ప్రత్యక్షమైనట్లుగా అనిపించాయని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నామన్నారు. కాలం మారినా, పరిస్థితులు మారినా వారి మధ్య ఉన్న స్నేహబంధం మాత్రం ఎప్పటికీ చెరిగిపోదని ఈ 25 సంవత్సరాల ఆత్మీయ కలయిక మరోసారి గుర్తు చేసిందన్నారు. ఈ అపూర్వమైన కలయిక జీవితాంతం మనసులో నిలిచిపోయే ఓ మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని, ఈ అందమైన కలయికకు సహకరించిన తోటి ఇంజనీరింగ్ మిత్రులందరికీ శ్రీకాంత్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# వర్షాలు కురువాలని కోరుతూ, గంగమ్మ తల్లికి బోనాలు సమర్పణ

### గంగమ్మ తల్లి ఆలయానికి బోణాలతో వెళ్ళి పూజలు చేసిన అయ్యవారిపల్లె ప్రజలు



**కొమరోలు పెన్ పవర్ జూలై 12**

కొమరోలు మండల వ్యాప్తంగా నిండుగా వర్షాలు కురిసి మెండుగా పంటలు పండాలని కోరుతూ కొమరోలు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ప్రజలు ఆదివారం బోనాలతో వెళ్లి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. జూన్ రెండవ వారం నుంచి వర్షాలు ప్రారంభమై జులై ఆగస్టు సెప్టెంబరు మాసాలలో జోరుగా,వానలు కురవవలసి ఉండగా ఈ ఏడాది జూలై మాసం మొదటి వారం పూర్తి అయినప్పటికీ వర్షపు జాడ ఎక్కడ కనిపించలేదు. రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం లేకపోవడంతో దిగాలు పడి కూర్చున్నారు. కొమరోలు మండల వ్యాప్తంగా జోరుగా వానలు కురవాలని, పంటలు మెండుగా పండాలని, రైతుల కష్టాలు తీరాలని కోరుతూ అయ్య వారి పల్లి గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం బోనాలతో ఊరేగింపుగా గ్రామం వెలుపల గల గంగమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అక్కడ గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించి పూజలు చేశారు గ్రామంలోని మహిళలందరూ తలలపై బోనాలు పెట్టుకొని ఊరేగింపు నిర్వహించడంతో గ్రామంలోను గంగమ్మ తల్లి ఆలయం వద్ద కోలాహలం కనిపించింది. గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించి పూజలు చేస్తే తప్పనిసరిగా వర్షాలు కురుస్తాయని నమ్మకంతోనే తాము గంగమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్నామని ఆ గ్రామం మహిళలు ముక్త కంఠంతో తెలిపారు.

# గిద్దలూరు అర్బన్ పరిధిలో సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు



**గిద్దలూరు పెన్ పవర్ జులై 12**

జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు గిద్దలూరు అర్బన్ పరిధిలోని పోలింగ్ బూత్ నెంబర్లు 198, 201 , 202లను సందర్శించి, ప్రస్తుతం జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపడుతున్న ఇంటింటి సర్వే, ఓటరు వివరాల ధృవీకరణ, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, అవసరమైన దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియలను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించి, కార్యక్రమం నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సర్ కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పని చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలలో సంబంధిత ఎన్నికల అధికారులు, తహశీల్దార్ ఎమ్ ఆంజనేయరెడ్డి,, మున్సిపల్ కమీషనర్ ఈ వి రమణ బాబు అధికారులు, సూపర్వైజర్లు , బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పరిశీలించిన రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 12**

రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు ఆదివారం ఒంగోలులో పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్ ) ప్రక్రియలో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, ఓటర్ల వివరాల డిజిటైజేషన్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట డిఆర్ఓ వెంకటరమణ, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, మునిసిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఇతర అధికారులు ఉన్నారు.



# అసామాన్య పద్య ప్రతిభ జాన్ కవి సొంతం

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 12**

పద్య కవిత్వంలో అసామాన్య ప్రతిభ మధురకవి మల్లవరపు జాన్ కవి సొంతమని కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు విభాగం కన్వీనర్ ఆచార్య సి.మృణాళిని పేర్కొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, జానుడి- సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మధురకవి జాన్ శతజయంతి సదస్సు ఒంగోలు మల్లయ్య లింగం భవన్లో నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జాన్ కవి రచించిన పలు పుస్తకాలపై సాహిత్య పరిశోధకులు పత్ర సమర్పణలు చేయగా , స్వాగత ఉపన్యాసం ఆచార్య మృణాళిని చేశారు. ఈ ప్రారంభ సదస్సు జానుడి సాహిత్య సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించగా కీలక ఉపన్యాసం ప్రముఖ సాహితీవేత్త , కవి డాక్టర్ కోయి కోటేశ్వరరావు మధురకవి మల్లవరపు జాన్ కవిత్వం లోని అనేక అంశాలను విశదం చేశారు. గుర్రం జాషువా సమకాలికుడిగా జాన్ కవి మన ప్రాంత అస్తిత్వాన్ని విశ్వవ్యాప్తం చేసి చీమకుర్తికి సముచిత గౌరవాన్ని కల్పించాడని అన్నారు . వేరు వేరు సదస్సులలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జవహర్ , ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ విస్తాలి శంకరరావు, విజయవాడ లయోలా కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వై విజయానంద రాజు, ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ బీరం సుందర రావు, సాహితీవేత్త డాక్టర్ కప్పగంతుల మధుసూదన శాస్త్రి తదితరులు ప్రసంగించగా,



అతిధులుగా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ మల్లవరపు సుధాకర్ రావు , మల్లవరపు ప్రభాకర రావు , తేళ్ల మనోజ్ కుమార్, జానుడి అధ్యక్షుడు ఎద్దు విజయకుమార్ లు పాల్గొన్నారు. అనంతరం జరిగిన స్థానిక సాహిత్య సంస్థల సభలో పి.రాజ్యలక్ష్మి, కే.అనిల కుమార్ సూరి,( సృజన), ప్రముఖ కవి కత్తి కళ్యాణ్, చప్పిడి కోటేశ్వరరావు, తంగిరాలసోని, పలు సాహిత్య సంస్థల ప్రతినిధులు పాల్గొనగా ఈ కార్యక్రమంలో 'సూక్తి శతకం' పద్య పోటీలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. పెద్ద ఎత్తున సాహిత్య అభిమానులు, జాన్ కవి శిష్యులు పాల్గొన్నారు.



# కుల వివక్ష పై సామాజిక శంఖారావం

### జయప్రదం చేయండి -మార్కాపురం జిల్లా రైతు సంఘం నాయకులు డి సోమయ్య




**గిద్దలూరు పెన్ పవర్ జులై 12**

గిద్దలూరు యుటిఎఫ్ కార్యాలయం నందు ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కుల వివక్ష పై సామాజిక శంఖారావం సమావేశం జరిగింది. ఈ సమావేశం కు డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి వై సింగరయ్య అధ్యక్షత వహించార ఈ సమావేశం లో రైతు సంఘం జిల్లా నాయకులు డి సోమయ్య పాల్గొని మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజం కోసం నిర్వహిస్తున్న సామాజిక శంఖారావాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. క్రిస్టియన్ దళితులకు ఎస్సీ రిజర్వేషన్ రద్దు చేయడం వంటి దళిత, బలహీన వర్గాల హక్కులను హరింపజేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విధానాలుగా ఉన్నాయని విమర్శించారు. ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు జిల్లాలో ఉన్న అన్ని దళిత గ్రామాలలో, పేటలలో, కాలనీలలో ప్రజాసంఘాల నాయకులు పర్యటన చేసి సమస్యలు అధ్యయనం చేసి వాటిపై పోరాటం చేయాలన్నారు. సిఐటియు మార్కాపురం జిల్లా అధ్యక్షులు టీ ఆవులయ్య మాట్లాడుతూ కొమరోలు మండలం బెడుసు పల్లె గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఒక ఐదు దళిత కుటుంబాలు అక్కడున్నటువంటి ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటుంటే కొంతమంది ఆ వూరు పెత్తందారులు ఆ భూమిలోకి పోనీయకుండా దళితులను అడ్డుకుంటున్నారని భూమిని దున్నుకునేందుకు ట్రాక్టర్లను కూడా పోనివ్వకుండా చేస్తున్నారని అన్నారు. ఈ సమస్యపై ఆ ఊరి దళిత భూభాధ్యులు ఆ సమస్యపై పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులను మండల అధికారులు కలిసిన సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇటువంటి సమస్యలు దళిత కాలనీలలో పేటలలో అనేకంగా ఉన్నాయని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దళిత కాలనీలలో మండల అధికారులు దళిత కాలనీలలో సమావేశాలు నిర్వహిస్తే ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి రుతమ్మ కేవీపీఎస్ జిల్లా నాయకులు ఐ విజయభాస్కర్ సిఐటియు జిల్లా నాయకులు డి తామస్ సిఐటియు మండల కన్వీనర్ బి నర్సింహులు మహిళా సంఘం నాయకురాలు బి సుజాత ప్రజానాట్యమండలి నాయకులు కె మహేశ్వర, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు జి విశ్రాంతమ్మ , భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు యు పోలయ్య, గొర్రెల మేకల పెంపకం ధరల సంఘం నాయకులు బి పూర్ణ, డి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ హర్షిణి విద్యార్థుల సత్తా



సిహెచ్.జ్యోష్ణ | ఎస్.అమూల్య | జి.లేఖన | కే.సుసన్య | వై.స్పందన | ఎం.మందిరారెడ్డి

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 12**

వివిధ కోర్సుల్లో విశ్వవిద్యాలయ ప్రథమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలిచారు. వివిధ కోర్సుల్లో అత్యుత్తమ శ్రేణులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ ఫలితాల్లో శ్రీ హర్షిణి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ఆనందదాయకమని అన్నారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావంతో కూడిన బోధన, కళాశాలలో కల్పిస్తున్న నాణ్యమైన విద్యా సౌకర్యాల ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే పట్టుదలతో మరింత ఉన్నత ఫలితాలు సాధించి కళాశాలకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్ విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీన్ దాది ఆంజనేయులు, జి ఎమ్ ఆర్ల శివరాం, ప్రిన్సిపాల్ ఎమ్ నాగేంద్ర, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల ఈ అద్భుత విజయంతో శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

# రేగులచెలక రెవెన్యూ భూముల వెబ్ ల్యాండ్ పై డిస్ప్యూట్ ఎత్తివేయాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 12**

రేగులచెలక రెవెన్యూలోని భూముల విషయంలో వెబ్ ల్యాండ్ పై విధించిన డిస్ప్యూట్ ను వెంటనే ఎత్తివేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని రేగులచెలక గ్రామం లో ఆదివారం రైతు సంఘం సమావేశం జరిగింది. తమ రెవెన్యూలోని భూములను వెబ్ ల్యాండ్ ను డిస్ప్యూట్ లో పెట్టడంతో బ్యాంకులలో వ్యవసాయ రుణాలు తీసుకునేందుకు, తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకునేందుకు తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఈ సందర్భంగా రైతు సంఘం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిమంది రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో అక్రమార్కులకు అండగా నిలిచి బోగస్ పట్టాలు ఇచ్చారని, అక్రమ పట్టాలు రద్దు చేయాలని గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ఆ గ్రామ వెబ్ ల్యాండ్ మొత్తాన్ని డిస్పూట్ లో పెట్టడం సరైన విధానం కాదన్నారు. అక్రమ పట్టాలపై విచారణ చేపట్టి అక్రమార్కులను శిక్షించాల్సి ఉండగా అధికారులు ఆ విధంగా చేయకుండా గ్రామంలోని రైతులందరినీ ఇబ్బందులు పాలు చేయడం సరి కాదన్నారు. వెంటనే వివాదం లేని భూములకు సంభందించి



వెబ్ ల్యాండ్ లో విధించిన డిస్ప్యూట్ ను ఎత్తివేయాలని ఆయన కోరారు. ఆరు మందితో గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఎం రత్నారెడ్డి, జవాజి మోహన్, వై వెంకటసుబ్బయ్య, పామూరి నారాయణ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి

### ఓటర్లకు మున్సిపల్ కమిషనర్ ఈవి రమణ బాబు విజ్ఞప్తి



**గిద్దలూరు పెన్ పవర్ జులై22**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమానికి కేవలం రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున గిద్దలూరు పురపాలక సంఘ పరిధిలోని అర్హులైన ఓటర్లందరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలనిమున్సిపల్ కమిషనర్ రమణబాబు కోరారు. ఓటర్ల సౌకర్యార్థం బి ఎల్ ఓలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఫారాల స్వీకరణతో పాటు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకొని గడువులోపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కమీషనర్ రమణ బాబు సూచించారు.సర్ కార్యక్రమానికి సంబంధించి ఏవైనా సందేహాలు, సలహాలు లేదా సమస్యలు ఉంటే వెంటనే గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ , సహాయ ఎన్నికల నమోదు అధికారి రమణబాబును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

# విభిన్న ప్రతిభావంతునికి త్రీ వీలర్ మోటారు వాహనం

### గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జులై 12**

రాచర్ల మండలం, ఆకవీడు గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడైన (దివ్యాంగుడైన) కంచర్ల శ్రీనివాసులు కు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి త్రీ-వీలర్ మోటార్ వాహనాన్ని అందజేశారు. గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం లబ్ధిదారునికి ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ... శారీరక వైకల్యంతో ఇబ్బంది పడుతున్న విభిన్న ప్రతిభావంతులు ఎవరిపైన ఆధారపడకుండా, స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇలాంటి వాహనాలను అందిస్తోందని తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి, అర్హుడైన ప్రతి విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం ,పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తనకు త్రీ వీలర్ మోటార్ వాహనం అందచేసిన రవాణా సౌకర్యం కల్పించి, జీవనోపాధికి అండగా నిలిచినందుకు లబ్ధిదారుడు, అతని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర రెడ్డి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కారు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి - ముగ్గురికి గాయాలు





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 12**

విధులకు వెళ్లి వస్తా అని చెప్పి ఇంటి నుండి బయలుదేరిన ఏ.ఆర్. కానిస్టేబుల్ కారు ప్రమాదంలో కానరాని లోకాలకు చేరాడు. ఆదివారం ఒంగోలు లోని మంగమూరు డొంక జంక్షన్ నుంచి దక్షిణం వైపు పాత బైపాస్ పద్మ టవర్స్ వద్ద టాటా నెక్సన్ కారు నడిరోడ్డుపై భీభత్సం సృష్టించింది. మున్సిపాలిటీ గార్బేజ్ వాహనాన్ని ఢీకొనగా డ్రైవర్ కు స్వల్ప గాయాలు కాగా, ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరికి ని ఢీకొనటంతో వారికి రక్త గాయాలు అయ్యాయి. అదే సమయం లో సైకిల్ పై డ్యూటీ కి వెళ్తున్న ఏ.ఆర్ కానిస్టేబుల్ మరియదాస్ ను కారు బలంగా ఢీ కొట్టడంతో మరియదాస్ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ప్రమాద ఘటన ను తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన కానిస్టేబుల్ మరియ దాస్ మృతదేహాన్ని స్థానిక రిమ్స్ హాస్పిటల్ కు తరలించారు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ప్రమాద ఘటనపై ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ యాక్సిడెంట్ జరగటం చాలా బాధాకరమని అన్నారు. మంగమూరు రోడ్డు వైపు నుంచి తాలూకా పోలీస్ స్టేషన్ వైపు వెళుతున్న కారు ఉదయం ఆరున్నర గంటల సమయంలో అతి వేగంగా వస్తున్న కారు వలన ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పోలీసు శాఖ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అనేక పర్యాయాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురికావడం శోచనీయమన్నారు. వాహనాలు వేగంగా నడపడం వల్ల వాహనంలో కూర్చున్న వారే కాకుండా ఎదురుగా వస్తున్న వారు కూడా ప్రమాదన గురై గాయపడటం తీవ్ర గాయాలవటం చనిపోవడం జరుగుతుందని మోటార్ వెహికల్ నిబంధనలు వాహన చోదకులు తప్పనిసరిగా పాటించాలని డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు సూచించారు.

## ఆర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ శంకుస్థాపన



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 12**

సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం రోడ్డు ఆర్చి నిర్మాణానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు శంకుస్థాపన చేశారు. 8లక్షల రూపాయలతో ఆర్చి నిర్మాణం చేపట్టనున్నారు. తిరుపతికి చెందిన పల్లకూరీ వెంకట్రావు నిధులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ గంగాడ సుజాత, వరదా వెంకట కృష్ణారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఇక్కడ నివసించే వారి కోరిక మేరకు ఈ ప్రాంతాన్ని సంతపేట ఆంజనేయస్వామి వీధిగా నామకరణం చేసేందుకు ఎమ్మెల్యే దామచర్ల అంగీకరించారు.

## నేడు కొండేపికి మంత్రి సవిత రాక



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 12**

ఒకరోజు పర్యటన నిమిత్తం సోమవారం జిల్లాలో కొండేపి నియోజక వర్గానికి రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత రానున్నారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. గుంటూరులోని తాడేపల్లి నుంచి మంత్రి సవిత రోడ్డు మార్గంలో ఉదయం 9 గంటలకు కొండేపి చేరుకోనున్నారు. ముందుగా సింగరాయ కొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామిని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో కలిసి దర్శించుకుంటారు. అనంతరం సింగరాయకొండలో రూ.60 లక్షలతో నిర్మించిన ఎస్టీ కాలనీ అప్రోచ్ రోడ్డును ప్రారంభోత్సవంతో సహా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అక్కడి నుంచి సింగరాయకొండలో మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదిత స్థలాలను పరిశీలించనున్నారు. నియోజక వర్గంలో ఉన్న ఎంజేపీ గురుకులాలను మంత్రి సవిత సందర్శించనున్నారు. అనంతరం ఆమె గుంటూరుకు తిరుగు పయనం కానున్నట్లు ఆ ప్రకటనలో మంత్రి కార్యాలయం తెలిపింది.

# వాసవి నగర్ అధ్యక్షులుగా కొత్తూరు వెంకట సుధాకర్ రావు

**కందుకూరు పెన్ పవర్, జూలై 12**

పట్టణంలో వాసవి నగర్ నందు ఆదివారం జరిగిన వాసవి నగర్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా 16 ఓట్లతో కొత్తూరి వెంకట సుధాకర్ రావు విజయం సాధించారు. మొత్తం 156 ఓట్లు పోలుకాగా తన ప్రత్యర్థికి 70 ఓట్లు, కొత్తూరి వెంకట సుధాకర్ కు 86 ఓట్లు వచ్చాయి. 16 ఓట్లతో కొత్తూరి వెంకట సుధాకర్ రావు విజయం సాధించారు. ప్రెసిడెంట్గా కొత్తూరు వెంకట సుధాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా కొత్త శ్రీనివాసులు, కోశాధికారిగా గోనుగుంట సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ గా నూకల సుబ్బారావు, జాయింట్ సెక్రెటరీగా చీదెళ్ల సోమశేఖర్, జాయింట్ ట్రెజరర్ గా జొన్నలగడ్డ శ్రీనివాసులు ఎన్నికయ్యారు. వీరు ఎన్నిక కావడం పట్ల వాసవి నగర్ వినాయకుడి గుడి వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని పలువురు ఆర్యవైశ్యులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. వాసవి నగర్ లో నివసించే వారి అందరి సహాయ సహకారంతో వాసవి నగర అభివృద్ధికి తోడ్పడుతామని నూతన కమిటీ



తెలిపారు. తమకు ఓటు వేసి తమ గెలుపుకి కారణమైన కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి, తమకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

## అనర్హుల జాబితాను పరిశీలించిన చెరుకుపల్లి వెంకటరెడ్డి



**సి.ఎస్.పురం, పెన్ పవర్ జూలై 12**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా మండల కేంద్రంలోని సి.ఎస్.పురం తహసిల్దార్ కార్యాలయంలో ఆదివారం ఉప్పలపాడు పోలింగ్ కేంద్రంలోని అనర్హుల జాబితాను సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత బీఎల్వోను అనర్హుల జాబితా వివరాలు, ప్రస్తుతం నమోదు చేసిన వివరాలను క్షేత్రస్థాయిలో చేపడుతున్న పరిశీలన విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు, అర్హత కోల్పోయిన వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాను సరిచేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు తొలగించేలా చర్యలు చేపట్టాలని బిఎల్ఓ కు సూచించారు.

# భక్తిశ్రద్ధలతో నారాయణస్వామికి విశేష పూజలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 12**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన గోపూజ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఆవరణలోని గోశాలలో గోవును అలంకరించి మేళతాళాల నడుమ వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. గోమాతను లక్ష్మీ స్వరూపిణిగా భావిస్తూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. తదుపరి స్వామివారికి సమర్పించనున్న మహా నైవేద్యాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం అర్చకులు గోత్రనామాలతో మంత్రోచ్చారణలతో భక్తులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేసిన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వీరంగం



**గిద్దలూరు పెన్ వర్ జులై 12**

గిద్దలూరు పట్టణం లోని కుమరామకట్ట సెంటర్ లో ఆదివారం ఓ యువకుడు మద్యం మత్తులో సాధువుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఇంత తతంగం జరుగుతున్నా ఆప్రాంతంలో జనాలు కనీసం వారించక పోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆప్రాంతం లో సినిమా చూసినట్లు చూస్తున్నా రే గాని కనీసం పోలీసుకు సమాచారం ఇద్దామని ఆలోచన రాకపోవటం విచిత్రం రోడ్డుమీద ఇద్దరు ఘర్షణ పడుతుండటం వల్ల హైవే పై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

## మనం పద్మ చక్ర సేవా రత్న జాతీయ అవార్డ్ అందుకున్న టి డి పి లీడర్ ముత్తుముల యల్లారెడ్డి



**కొమరోలు, పెన్ పవర్, జూలై 12**

మార్కాపురం జిల్లా కొమరోలు మండలం బాదినేని పల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ముత్తుముల యల్లారెడ్డి సామాజిక కార్యకర్త తెలంగాణ రాష్ట్రంలోని చిక్కడపల్లి లో ఉన్న త్యాగరాయ గానసభ దీక్షతులు హాల్ నందు మనం ఫౌండేషన్ 10 వార్శికొత్సవము ఘనంగా నిర్వహించారు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముత్తుముల ఎల్లారెడ్డిని మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మనం పద్మ చక్ర సేవారత్న జాతీయ అవార్డ్ గౌరవ పెద్దల చేత అందించారు అవార్డు అందుకున్న ముత్తుముల యల్లారెడ్డి మాట్లాడుతూ మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కె చక్రవర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం

### అభినందనలు తెలిపిన మండవ మురళీకృష్ణ.. గోరంట్ల రవి కుమార్




**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 12**

విద్యా సంస్థలు 21వ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ కరాటే ఛాంపియన్షిప్ 2026 సెలెక్షన్స్ ఒంగోలు హర్షిణి డిగ్రీ కాలేజీ నందు జరిగాయి. ఈ పోటీలు సబ్ జూనియర్స్, క్యాండిట్ సీనియర్స్ విభాగాలు సింగిల్ కటా కుంబితే తదితరు విభాగాలు కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండవ మురళి కృష్ణ, హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవి కుమార్, ప్రతిభా విద్యాసంస్థల సీఈఓ నల్లూరి జయప్రకాష్ నారాయణ, డాక్టర్ గుండవరపు రాఘవ, మారెళ్ళ సుబ్బా రావు మండవ సుబ్బారావు పాల్గొని స్టేట్ కి సెలెక్ట్ అయిన క్రీడా కారుల కి సర్టిఫికెట్లు బెల్టులు అందజేసి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా లో పలు ప్రాంతాల నుంచి నుండి 150 మంది క్రీడా కారులు పాల్గొనడం ఆనందకరం అని ప్రకాశం జిల్లా కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నల్లూరి మోహన్ రావు తెలియ చేశారు. క్రీడా కారులకు ఉత్తమ శిక్షణ ఇచిన జి.అనిల్ కుమార్, షేక్ హిమాంశా, వి.వెంకటేశ్వర్లు, యన్ . మహేంద్ర (నేషనల ప్లేయర్), జి.మణికంత (నేషనల్ ప్లేయర్ జి.మణికంత, పి .దేవానంద్, పి .సాగర్ లను అభినందలు తెలిపారు.




## వంగవీటి రాధా ని కలిసిన రాయుడు మిత్ర బృందం

**సి ఎస్ పురం పెన్ పవర్ జూలై 12**

స్వర్గీయ కాపుల ఆరాధ్య దైవము మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా తనయుడు వంగవీటి రాధా కృష్ణను విజయవాడలోని ఆయన నివాసంలో సి ఎస్ పురం టిడిపి యువ నాయకులు బోయిన రాయుడు మిత్ర బృందం మర్యాద పూర్వం కలిశారు కార్యక్రమంలో మన్నేపల్లి రవి మన్నేపల్లి సురేంద్ర తదితరులు ఉన్నారు.



## పోలీసుల అదుపులో ఏడుగురు జూదరులు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 12**

వెంగముక్కలపాలెం గ్రామంలో కోతముక్క పేకాట శిబిరం పై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై చెంచయ్య, సిబ్బంది దాడి చేసి 7 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం జరిగిన ఈ సంఘటనలో వారి వద్ద నుండి నగదు రూ. 1460/- లు, 7 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఎవరైనా ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. వారిని తదుపరి చర్యల నిమిత్తం ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు తెలిపారు.

# లాడ్జిలను ఆకస్మిక తనిఖీ చేసిన పోలీసులు







**కందుకూరు పెన్ పవర్, జూలై 12:**
కందుకూరు పట్టణ, రూరల్ స్టేషన్ల పరిధిలోని లాడ్జిలను కందుకూరు సర్కిల్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కందుకూరు సిఐ షేక్ అన్వర్ భాషా లాడ్జిల యజమానులతో మాట్లాడుతూ ప్రతి లాడ్జిలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, లాడ్జిలకు వచ్చే ప్రతి ఒక్కరి వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్ లో నమోదు చేయాలని, వారి యొక్క గుర్తింపు కార్డులు స్వీకరించాలని తెలిపారు. అలాగే లాడ్జిలలో అసాంఘిక కార్యక్రమాలు అనగా పేకాట, వ్యభిచారం,బెట్టింగ్,మట్కా మొదలగు వాటిని జరగకుండా చూసుకోవాలని, జరుగుతున్నట్లుగా అనుమానం వస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎవరైనా లాడ్జి యజమానులు పేకాట,వ్యభిచారం,బెట్టింగ్, మట్కా లు నిర్వహించుటకు సహకరిస్తే ఆ లాడ్జి యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనిస్తూ ఉండాలని అలాంటి వారి గురించి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కందుకూరు పట్టణ రూరల్ ఎస్సైలు శివ నాగరాజు, బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ ఆస్తుల ప్రైవేటీకరణకు దారితీసే జీఓ 673ను రద్దు చేయాలి – సిపిఎం డిమాండ్




**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 12**
పట్టణ పౌర సేవలు, మౌలిక సదుపాయాలు, మునిసిపల్ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.673ను వెంటనే రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ జీఓ అమలైతే నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, పార్కులు, మార్కెట్లు తదితర ప్రజాసేవలపై భారీ యూజర్ చార్జీలు విధించడంతో పాటు ప్రస్తుత పారిశుద్ధ్య కార్మికుల ఉపాధి కూడా ప్రమాదంలో పడుతుందని పార్టీ నాయకులు హెచ్చరించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం జి. రమేష్ అధ్యక్షతన జరిగిన సీపీఎం నగర కమిటీ సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్థానిక సంస్థలకు రాజ్యాంగ బద్ధంగా అందాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకుండా, ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి మునిసిపల్ ఆస్తులను ప్రైవేటు పరం చేయాలని చూస్తోందని విమర్శించారు. పౌరసంఘాలు, రెసిడెంట్స్ అసోసియేషన్లు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు కలిసి జీఓకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తంబి శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్, నాయకులు టి. మహేష్, ధారా వెంకటేశ్వర్లు, జి ఆదిలక్ష్మి, జి శ్రీనివాసరావు, బి.వి రావు, తదితరులు పాల్గొన్నారు.

## గాండ్ల, తెలికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**పొదిలి, పెన్ పవర్, జూలై 12**
రాష్ట్ర గాండ్ల, తెలికుల సంక్షేమం కోసం ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గాండ్ల, తెలికుల కులస్తులు కోరారు. ఆదివారం నాడు పొదిలి పట్టణంలో అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చిట్టెం శెట్టి వెంకట కృష్ణారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ తమ కులస్తుల కోసం ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు సబ్సిడీపై నూనె గానుగలు ఏర్పాటు చేయాలని, వాటికి ప్రభుత్వం రాయితీ కల్పించాలని, జిల్లా కేంద్రాలలో కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా గాండ్ల, టెలి కుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి, సభ్యులు ఎం అనంతలక్ష్మి, సిహెచ్ శ్రీనివాసరావు, బి నిమ్మేశ్వరరావు, డి శంకరరావు, ఎం రామారావు, సిహెచ్ చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు సి పి ఐ అండగా ఉంటుంది

### పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుదాం

### సి పి ఐ జాతీయ అధ్యక్షుడు డా నారాయణ వెల్లడి



**పెన్ పవర్ జరుగుమల్లి, జులై 12**
రాష్ట్ర వ్యాప్తంగా పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టే అవసరమైన పోరాటానికి భారత కమ్యూనిస్టు పార్టీ రైతులకు అండగా ఉంటుందని సమస్య పరిష్కారం అయ్యేవరకు అండగా ఉంటుందని జాతీయ అధ్యక్షుడు డా నారాయణ చింతల పాలెం పొగాకు రైతులకు భరోసా ఇచ్చారు. కొండపి నియోజకవర్గం పర్యటన లో భాగంగా డా నారాయణ ఆదివారం జరుగుమల్లి మండలం చింతల పాలెం గ్రామ పొగాకు రైతులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ ప్రాంతం రైతులు పొగాకు మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని వారిని ఆదుకోవడం పాలకుల బాధ్యత అన్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా పొగాకు బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని మధ్యవర్తులు, రైతులను దోపిడి చేసేవారికి అవకాశం లేకుండా భరోసా ఇవ్వాలని అండగా ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చింతల పాలెం పొగాకు రైతులు డా నారాయణ తో తమ బాధలు వివరించారు.

## పదోన్నతితో డైట్ సీనియర్ లెక్చరర్‌గా రాజాల కొండారెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 12**
మండల విద్యాశాఖాధికారి–2గా గత మూడు సంవత్సరాలుగా సేవలందిస్తున్న రాజాల కొండారెడ్డిని మైనంపాడు డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్ గా నియమిస్తూ విద్యాశాఖాధికారుల కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన సోమవారం నుంచి మైనంపాడు డైట్ కళాశాలలో కొత్త బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజాల కొండారెడ్డి మాట్లాడుతూ మండలంలో విద్యా శాఖాధికారి–2గా విధులు నిర్వహించే అవకాశం దక్కడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. మూడు సంవత్సరాల పదవీకాలంలో మండలంలోని పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలులో అందరి సహకారంతో ముందుకు సాగినట్లు పేర్కొన్నారు. తన విధుల నిర్వహణలో ఎంఈఓ జె. ప్రసాదరావు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. అలాగే మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, ఎంఆర్సీ సిబ్బంది దీప్తి, ప్రవీణ్, సీఆర్ఎంటీలు, ఏఈ ప్రకాష్, ఐఈఆర్పీలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు ఎప్పటికప్పుడు సహకరించి విద్యాశాఖ కార్యక్రమాల విజయవంతానికి తోడ్పాటునందించారని కొనియాడారు. అదేవిధంగా విద్యా కార్యక్రమాల ప్రచారం, ప్రజలకు సమాచారం చేరవేయడంలో పాత్రికేయ మిత్రులు అందించిన సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. మండలంలో విధులు నిర్వహించిన కాలంలో పాఠశాల విద్యా కమిటీలు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం తనకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చిందన్నారు మీ అందరి సహకారం ఆదరణతోనే మూడు సంవత్సరాల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించగలిగినానని అన్నారు ప్రస్తుతం సీనియర్ లెక్చరర్ గా పదోన్నతి పై బదిలీ అయినప్పటికీ మండల ప్రజలు ఉపాధ్యాయులతో తన అనుబంధం కొనసాగుతుందని తెలిపారు.

## మందుబాబులకు భారీ మోత.

- 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా.
- బహిరంగంగా మద్యం తాగిన మరో 30 మందికి ఫైన్.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 12.** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై న్యాయస్థానం కొరడా ఝళిపించింది. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో నిబంధనలు ఉల్లంఘించిన మందుబాబులకు భారీ జరిమానాలు విధించారు. ఈ మేరకు చింతపల్లి ఎస్సై జి. వీరబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ?ఇటీవల పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 11 మంది పట్టుబడ్డారు. వీరందరినీ శనివారం లోక్ అదాలత్‌లో జ్యుడిషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున భారీ జరిమానా విధించారు. అలాగే, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిన మరో 30 మందికి కూడా లోక్ అదాలత్‌లో జరిమానా విధించినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరబాబు మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం తమతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఇకముందు కూడా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా కొప్పోలు వేణుగోపాల స్వామి మందిర వార్షికోత్సవం





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 12**
ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కొప్పోలు శ్రీ వేణుగోపాజిల కృష్ణస్వామి మందిరం అధ్యక్షులు జమ్ము రత్తయ్య అన్నారు. కొప్పోలు లోని శ్రీ గోపాలకృష్ణస్వామి మందిర 9వ వార్షిక మహోత్సవం సందర్భంగా స్వామివారి కళ్యాణం ఆదివారం ఉదయం అంగరంగ వైభవంగా జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు విశేష పూజలు నిర్వహించామని తెలిపారు. మందిర ప్రధానార్చకులు పరంకుసం వెంకట హరిప్రసాద్ ఆధ్వర్యంలో కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కళ్యాణ మహోత్సవంలో దంపతులుగా జమ్ము రత్తయ్య జయలక్ష్మి దంపతులు, బాపట్ల సనత్ కుమార్ పావని దంపతులు, పి గంగయ్య సుష్మ దంపతులు, గుండు ప్రసన్నఆంజనేయులు భార్గవి దంపతులు కళ్యాణ మహోత్సవంలో దంపతులుగా పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అధ్యక్షులు కొప్పోలు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కోనంకి చిరంజీవి , మోడుబోయిన నాగరాజు, యాదాల పవన్ కుమార్, మోడు బోయిన శ్రీనివాసరావు గంగాడి శ్రీనివాసరావు, పసల్ సుబ్బారావు, యాదాల రామాంజనేయులు స్థానిక వాసులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

## బోర్ పనుల వివాదం.. వైఎస్సార్సీపీ వైఖరిని ఖండించిన కూటమి నేతలు

సంకాడలో బోర్ పనులకు అడ్డంకులపై కూటమి నేతల ఆరోపణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 10:** సంకాడ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన బోర్‌వెల్ తవ్వకాలను వైఎస్సార్సీపీ నాయకులు అడ్డుకున్నారని కూటమి నాయకులు ఆరోపించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై గ్రామ పెద్దలు, కూటమి నాయకులు సమావేశమై చర్చించి, అధికారులు శుక్రవారం బోర్‌వెల్ తవ్వకానికి ముహూర్తం నిర్ణయించినట్లు తెలిపారు. అయితే వైఎస్సార్సీపీ ఎంపీపీ హాజరుకాలేదనే కారణంతో వైస్ ఎంపీపీ లోత దేముడు బోర్‌వెల్ పనులను నిలిపివేశారని ఆరోపిస్తూ ఈ చర్యను ఖండించారు. తాగునీరు అందించడం రాజకీయాలకు అతీతమైన అంశమని, అభివృద్ధి పనులకు ఆటంకం కల్పించడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలను మరింత కష్టాల్లోకి నెట్టే విధంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఈ సందర్భంగా జనసేన పంచాయతీ అధ్యక్షుడు ఊలం ఈశ్వరరావు, టీడీపీ మాజీ ఎంపీటీసీ మొట్టడం లక్ష్మణరావు, మొట్టడం రాజారావు, డొంబురి చిట్టిబాబు, లోచల భీమరాజ్, కోర గురుమూర్తి, మొట్టడం సూర్యారావు, డొంబురి గిరిబాబు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. సంకాడ గ్రామంలో బోర్‌వెల్ పనులను వెంటనే ప్రారంభించి, శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఫలిస్తున్న శ్రీగిరి నిర్వాహకుల కృషి

### – బాల విహార్ జ్ఞాన విహార్ గా పరిణమించిన వైనం

### – విద్యార్థులలో ఉత్సాహం నింపిన చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద




**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 12**
చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద ఆగమనంతో శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులు క్రొత్త కళను సంతరించుకున్నాయి. ఆదివారం శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్ లో చిన్మయ మిషన్ తోడ్పాటుతో ఏర్పాటైన శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులలో స్వామి సత్యాత్మానంద పాల్గొని విద్యార్థులలో జ్ఞాన తృష్ణను వర్ధిల చేశారు. విద్యార్థుల నాడి గ్రహించిన స్వామి సత్యాత్మానంద వారిలో ఉత్సాహం నింపే విధంగా వర్ణమాలను తప్పులు లేకుండా పలికించడంతో పాటు ప్రార్ధనా శ్లోకాలను భగవద్గీత శ్లోకాలను నేర్పించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో వాటిని నేర్చుకోవడంతోపాటు కంఠస్థం చేశారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలతో పాటు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిచయం చేయడం వారిలో వ్యక్తిత్వ వికాసం పరిఢవిల్లేలా చేయడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కృషిలో తమకు చక్కటి తోడ్పాటును అంద చేస్తున్న చిన్మయ మిషన్ నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పలు పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# జాతీయ గీతమే ముందు ..కేంద్రం గైడ్ లైన్స్ !

**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ గీతం మనకు ఉంది రాష్ట్ర గీతం కూడా ఉంటుంది. అయితే ఈ రెండింటిలో ఏది ముందు అన్న చర్చ వస్తోంది. దానికి కొన్ని రాష్ట్రాలలో అనుసరించే విధానం బట్టి. ముఖ్యంగా తమిళనాడు విషయం తీసుకుంటే వారు అసెంబ్లీ సమావేశాలలో అయినా ప్రభుత్వ అధికార కార్యక్రమాలలో అయినా ముందు రాష్ట్ర గీతం ఆలపించిన మీదటనే జాతీయ గీతం అని అమలు చేస్తున్నారు. డీఎంకే అధికారంలో ఉన్నపుడు ఈ విధంగానే చేస్తే వరసగా రెండు బడ్జెట్ సెషన్లను ఆనాడు గవర్నర్ గా ఉన్న రవి బాయ్ కాట్ చేసి వెళ్ళిన సందర్భం ఉంది. ఇక విజయ్ సీఎం అయిన తరువాత ప్రమాణం సందర్భంగా జాతీయ గీతం ముందు ఆలపించారు. తరువాత రాష్ట్ర గీతం ఆలపించారు. దాంతో దాని మీద విపక్షాలు విమర్శలు గుప్పించాయి. అయితే ఏది ముందు ఏది తరువాత అన్న దాని మీద ఫలనాదే తప్పనిసరి అని గైడ్ లైన్స్ లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఉత్పన్నం అవుతోంది అని అంటున్నారు. ఈ క్రమంలో కేంద్రం మార్గదర్శకాలు తాజాగా విడుదల చేసింది.

**ఇది తప్పనిసరి అంటూ :**

ఇక దేశంలోని రాష్ట్రాలు ప్రభుత్వ కార్యక్రమాలలో గీతాల ఆలాపన క్రమాన్ని కేంద్రం సూచించింది. ముందు జాతీయ గీతంగా జనగణమన ఆలపించాలని ఆ తరువాత జాతీయ గేయం అయిన వందేమాతరం ఆలపించాలని రాష్ట్ర గీతం ఆ తరువాత వరసలో ఉండాలని దిశానిర్దేశం చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. వాటిని కేంద్రం హోం మంత్రిత్వ శాఖ దేశంలోని వివిధ రాష్ట్రాలకు కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడిన పంపించింది. ప్రతీ అధికార కార్యక్రమాలలో జాతీయ చిహ్నాలు వాటి గౌరవాన్ని కాపాడడం ఏకరూపతను పాటించడం కోసం ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కోరింది. ఈ ఉత్తర్వులలో ఇప్పటికే ఉన్న ఆదేశాలని కూడా మరోసారి రిపీట్ చేస్తూ తాజాగా గైడ్ లైన్స్ విడుదల చేసింది.

**నిబంధనలు ఈ విధంగానే :**

ఇక జాతీయ గీతం ఆలపించే సందర్భంలో ప్రేక్షకులు తప్పనిసరిగా లేచి నిలబడి అటెన్షన్ లో ఉండాలని పేర్కొంది. అదే న్యూస్ రీల్స్ లేదా డాక్యుమెంట్ల ప్రదర్శన సమయంలో జాతీయ గీతం వస్తే అపుడు నిలబడాల్సిన అవసరం లేదని కానీ నిశ్శబ్దం పాటించాలని సూచించింది. ఇది ఎప్పటి నుంచో నిబంధనలుగా ఉన్నా కూడా మరో మారు గుర్తు చేస్తూ గైడ్ లైన్స్ ని తాజాగా పేర్కొంటున్నట్లుగా కేంద్ర హోం శాఖ వెల్లడించింది.

ఇక ఈ గైడ్ లైన్స్ ప్రకారం తప్పనిసరిగా ముందు రాష్ట్రగీతం కూడా ఆలపించాల్సి వస్తే అపుడు వందేమాతరం ఆలపించాలని జనగణమన కూడా పూర్తిగా ఆలపించాలని ఈ రెండూ అయ్యాకనే రాష్ట్ర గీతం ఆలపించాలని పేర్కొంది. జాతీయ గౌరవాన్ని కాపాడడానికే ఈ కచ్చితమైన నిబంధలను అని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతీయ గేయం హోదాను కలిగి ఉండగా, రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన జాతీయ గీతంగా గుర్తింపు పొందింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు.. అమరావతి రైతులకు గుడ్ న్యూస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ల్యాండ్ పూలింగ్ రైతులకు వ్యవసాయ రుణాల మాఫీ అమలు చేయాలని నిర్ణయించింది. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలోని గ్రామాల్లో డెట్ వేవర్ స్కీమ్‌కు ఆమోదంతెలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు రుణమాఫీ అమలు అధికారాలు మంజూరు చేసింది. 2026 జనవరి 6 నాటికి ఉన్న వ్యవసాయ రుణాలకు రుణ మాఫీ వర్తించనుంది. అమరావతి రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశ్యంలో ఏపీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**రెండోదశ ల్యాండ్ పూలింగ్ లో...**

అమరావతిలో రెండోదశ ల్యాండ్ పూలింగ్ రైతులకు యాన్యుటీ పెంపుదలకు కూడా ఏపీ ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. మెట్ట, జరీబు భూములకు పది వేల రూపాయల చొప్పున యాన్యుటీ పెంచాలని నిర్ణయించింది. మెట్ట భూములు ఎకరాకు ముప్ఫయి వేల రూపాయల నుంచి నలభై వేల రూపాయలకు పెంచింది. జరీబు భూములు ఎకరాకు యాభై వేల రూపాయల నుంచి అరవై వేల రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో అమరావతి కోసం స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించినట్లయింది. ప్రభుత్వం నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో రాజధానిలో అమరావతి నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ కింద భూమి ఇచ్చిన రైతులకు ఊరట కల్పించినట్లయింది. 2024 జూన్ 12 తర్వాత ఒప్పందం చేసుకున్న రైతులకు మాత్రమే ఇది వర్తించనుంది

**భారీ ఊరట కల్పించడంతో...**

పదేళ్లపాటు యాన్యుటీ చెల్లింపులు జరుగుతాయని చెప్పింది. సీఆర్డీఏ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణలు చేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.1,122.86 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. మున్సిపల్ బాండ్ల ద్వారా రూ.1,010.58 కోట్లు సమీకరించనున్న కూటమి ప్రభుత్వంప్రభుత్వ గ్యారంటీ లేకుండానే బాండ్ జారీ ప్రక్రియను చేపట్టనుంది. ఏపీ సీఆర్‌డీఏ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ట్రంక్ రోడ్ల నిర్మాణంలో నివాసాలు కోల్పోయిన వారికి జీవన భృతి రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు పెంచింది. 12 నెలలపాటు నెలకు రూ.10 వేలు చొప్పున జీవన భృతి కల్పించాలని నిర్ణయించింది. ఇంటి అద్దెతో కలిపి జీవన భృతి చెల్లింపునకు ఆమోదం తెలిపింది.

# పథకం అందాలంటే చేయాల్సిన పనులివే..లేకుంటే రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** తల్లికి వందనం పథకం కింద అర్హత పై ఏపీ ప్రభుత్వం కొత్త నిబంధనలను విధించింది. పథకం పూర్తి పారదర్శకంగా ఉండాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. తల్లికి వందనం పథకం కింద ప్రతి తల్లి ఖాతాలో ప్రభుత్వం ఒక విద్యార్థికి పదిహేను వేల రూపాయలను జమ చేస్తుంది. అందులో పాఠశాల నిర్వహణకు రెండు వేల రూపాయలు మినహాయించుకుంటుంది. అయితే తాజాగా విడుదలయిన నిబంధనల మేరకు తల్లికి వందనం పథకం కింద అర్హుల జాబితాను వార్డు సచివాలయాల్లో ప్రచురించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**డబ్బులు పడాలంటే...**

ప్రతి తల్లి బ్యాంకు ఖాతాకు ఆధార్ తో లింకు అవ్వడం తప్పనిసరి. అలాగే కేవైసీని కూడా సమర్పించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుకు అర్హుల జాబితాను పూర్తి పారదర్శకంగా రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. డబ్బులు రావాలంటే తప్పనిసరిగా తల్లి బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ అయి ఉండాలి. చీూజ× (ొఖుఎష్ఘుతీ ాావవఎఱఅస్త్ర) పూర్తయి ఉండాలి. ఖ్జ వివరాలు అప్ డేట్ చేసి ఉండాలి. అర్హుల జాబితా త్వరలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఏదైనా అభ్యంతరాలుంటే ప్రభుత్వానికి తెలియజేయవచ్చని, అర్హులందరికీ తల్లికి వందనం నిధులు జమ అవుతాయని చెప్పింది.

**ఆందోళన చెందవద్దు...**

తల్లికి వందనం నిధుల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులున్నప్పటికీ అందరికీ అందచేస్తామని చెప్పారు. ప్రతి తల్లి ఖాతాలో త్వరలోనే నగదును జమ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. పథకం విషయంలో జరుగుతున్న ప్రచారంపై ఎవరూ నమ్మవద్దని, తమ ప్రభుత్వం అర్హులందరికీ పథకాన్ని వర్తింపచేయాలన్నదే తమ ఉద్దేశ్యమని, అందుకే నిబంధనలను కఠినతరం చేయాలని నిర్ణయించామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసే ప్రతి పైసాకు న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

# బొత్స మేనల్లుడు ఎంపీనా లేక ఎమ్మెల్యేగానా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయనగరం వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా జిల్లా పరిషత్తు చైర్మన్ గా ఉన్న వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను వచ్చే ఎన్నికల్లో ఎంపీగానా లేక ఎమ్మెల్యేగానా దేనికి పోటీ చేస్తారు అన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే ఆయన రాజకీయ క్షేత్రం పూర్తిగా విజయనగరం జిల్లాగానే ఉంది. ఆయన జిల్లా అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు అక్కడే పట్టు ఉంది. అయితే విశాఖ జిల్లా భీమునిపట్నం అసెంబ్లీ ఇంచార్జిగా ఆయనకు వైసీపీ అధినాయకత్వం బాధ్యతలు అప్పగించింది. దాంతో ఆయన ఈ బాధ్యతను కూడా మోస్తున్నారు. అయితే ఆయన తగినంత సమయం భీమిలీలో వైసీపీని అభివృద్ధి చేసేందుకు ఇవ్వలేకపోతున్నారు అన్నది విమర్శగా ఉంది.

**అసలే కంచుకోటగా :**

ఇక భీమిలీ అన్నది సామాన్యమైన సీటు కాదు. ఇది టీడీపీకి కంచుకోటగా ఉంది. 1983 నుంచి ఇప్పటికి పది సార్లు అసెంబ్లీకి ఎన్నికలు జరిగితే మూడు సార్లు తప్ప మిగిలిన అన్ని సార్లూ టీడీపీ గెలిచింది. భీమిలీ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం నిర్ణయాత్మక శక్తిగా ఉంటుంది. అలాగే బీసీలు అధికం. మత్స్యకారులు యాదవులు నాగవంశీకులు ఇలా అనేక సామాజిక వర్గాలు భీమిలో రాజకీయాల్లో ప్రభావితం చేస్తాయి. చిన్న శ్రీను కాపు సామాజిక వర్గానికి చెందిన వారు కావడం, భీమిలీ అసెంబ్లీలో కొంత భాగం విజయనగరం అసెంబ్లీ సీటుని ఆనుకుని ఉండడంతో ఆయనకు ఈ బాధ్యతకు అప్పగించారు అని అంటున్నారు. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ వైసీపీకి రాజీనామా చేసిన తరువాత వైసీపీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే భీమిలీ వైసీపీకి చిన్న శ్రీను చుట్టపు చూపుగా వస్తున్నారు అన్న విమర్శలు సొంత పార్టీ నుంచే ఉన్నాయని అంటున్నారు.

**వర్గ పోరుతో పార్టీ :**

ఇక స్థానికులకే వైసీపీ ఇంచార్జి బాధ్యతలు అప్పగించాలని వైసీపీలో డిమాండ్ ఉంది. గతంలో కూడా అవంతికి బాధ్యతలు అప్పగించి సీటు ఇచ్చారు. ఆయన తీరా గెలిచిన తరువాత తన సొంత వర్గానికే మేలు చేశారు అని వైసీపీలో మొదటి నుంచి ఉంటున్న వారికి అన్యాయం జరిగింది అని గుర్తు చేస్తున్నారు. ఇక వర్గ పోరు అధికం అయి 2024 లో ఘోరంగా వైసీపీ ఓటమి పాలు అయింది అని అంటున్నారు. ఇపుడు కూడా స్థానికేతరుడిగా చిన్న శ్రీనుని వైసీపీ వర్గాలు అంటున్నాయి. దాంతో టీడీపీకి బలమైన కంచుకోటలో వైసీపీ మరింతగా ఇబ్బందులు పడుతోంది తప్ప ఎత్తిగిల్లలేకపోతోంది అని అంటున్నారు.

**ఎంపీగానే చాన్స్ :**

చిన్న శ్రీనుకి వచ్చే ఎన్నికల్లో విజయనగరం నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తారు అని కూడా అంటున్నారు. ఎన్నికల సమయానికి సరైన నాయకుడికే టికెట్ దక్కుతుందని ఒక వైపు ప్రచారం సాగుతోంది. అయితే విశాఖ జిల్లాలో కూడా బొత్స హవా

సాగుతున్న నేపథ్యంలో చిన్న శ్రీను భీమిలీ నుంచి ఎమ్మెల్యేగానే పోటీకి దిగుతారు అని అంటున్నారు. ఒకవేళ ఆయనకు ఆ ఉద్దేశం ఉంటే ఇప్పటి నుంచే పార్టీని పటిష్టం చేయాలని విజయనగరం జిల్లా రాజకీయాలను వదిలేసి పూర్తి కాలం వెచ్చించాలని పార్టీ నేతలు కోరుతున్నారు. అలా కాకుండా రెండు చోట్లా ఉంటే కనుక అది వైసీపీకే ఇబ్బంది అవుతుందని అంటున్నారు.

# బాంకీపూర్ ఉప ఎన్నిక : నితీన్ నబీన్ ఎం ప్రశాంత్ కిషోర్.. ఇద్దరి సత్తాకు అతిపెద్ద పరీక్ష





**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ జాతీయ అధ్యక్ష్యుడు నితీన్ నబీన్ సొంత నియోజకవర్గం బాంకీపూర్ ఉప ఎన్నిక ఉత్కంఠ రేపుతోంది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా నితీన్ నబీన్ ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గానికి ఈ నెల 30న ఉప ఎన్నిక జరుగుతోంది. నితిన్ నబీన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానం నుంచి జన సురాజ్ పార్టీ అభ్యర్థిగా ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్(పీకే) పోటీకి దిగడంతో రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. అయితే పీకే రంగంలోకి దిగిన తర్వాత బీజేపీ తన అభ్యర్థిని మార్చివేడయడమే హాట్ టాపిక్ అవుతోంది. ఈ పరిణామాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న ప్రశాంత్ కిషోర్ బీజేపీ తనకు భయపడిందని చెప్పుకోవడంపై విస్తృత చర్చ జరుగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా బీజేపీ తొలిసారిగా అభ్యర్థిని మార్చిందంటూ ప్రశాంత్ కిషోర్ చెబుతున్నారు. అయితే ఇందులో వాస్తవం లేదని బీజేపీ కొట్టిపడేస్తోంది. బాంకీపూర్ ఉప ఎన్నికకు బీజేపీ అభ్యర్థిగా తొలుత అభిషేక్ కుమార్ అనే నేతకు టికెట్ ఇచ్చారు. అయితే కుటుంబ వివాదాలు, ఇతర విమర్శలతో అభిషేక్ ను తప్పించి ఆయన స్థానంలో నీరజ్ కుమార్ సిన్హాకు టికెట్ ఇచ్చింది. అయితే ఈ పరిణామాన్ని అనుకూలంగా మార్చుకున్న ప్రశాంత్ కిషోర్ తనను తట్టుకోలేక బీజేపీ అభ్యర్థిని మార్చిందని ప్రచారం చేసుకోవడం ఆసక్తికర చర్చగా దారి తీసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కచోట గెలవని జనసురాజ్ పార్టీ అధినేత ఎలాగైనా అసెంబ్లీలో అడుగు పెట్టాలనే లక్ష్యంతో ఈ ఉప ఎన్నికల బరిలో దిగారు. దీంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బీజేపీ కంచుకోటగా భావించే ఈ నియోజకవర్గం ప్రస్తుతం రాజకీయ ఉత్కంఠకు కేంద్ర బిందువుగా మారింది.

ఒకవైపు నితీన్ నబీన్, మరోవైపు ప్రశాంత్ కిషోర్ ఉండటంతో ఈ ఎన్నిక దేశవ్యాప్తంగా ఆకర్షిస్తోంది. బాంకీపూర్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నితీన్ నబీన్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవడం ఆయన ప్రతిష్టకు పరీక్షగా చెబుతున్నారు. బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సొంత నియోజకవర్గంలో గెలిచి తన సత్తా నిరూపించుకోవాల్సివుందని అంటున్నారు. మరోవైపు బీజేపీ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరికి కూడా ఈ ఎన్నిక ఒక సవాల్ గా చెబుతున్నారు. ఇదే సమయంలో జనసురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ రాజకీయ భవిష్యత్తుగా ఈ ఎన్నిక మరో అవకాశంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇలా దేశవ్యాప్తంగా పేరున్న ముగ్గురు నేతలకు బాంకీపూర్ ఉప ఎన్నిక విషమ పరీక్షగా నిలవడమే హాట్ టాపిక్ అవుతోంది. బీజేపీ అభ్యర్థిని మార్చడమే కాకుండా ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉందని ప్రశాంత్ కిషోర్ ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఆయన తన శక్తియుక్తులు అన్నీ ప్రయోగిస్తున్నారు. దేశంలో పలు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను గెలిపించానని చెప్పుకున్న ప్రశాంత్ కిషోర్ సొంత రాష్ట్రంలో చతికిల పడటంపై గతంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. సంస్థాగత బలం లేక ఆ ఎన్నికల్లో ఓడిపోయారని సరిపెట్టుకున్నా, ఇప్పుడు ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో నెగ్గలేకపోతే ఆయన వృత్తి జీవితం కూడా ఒడిదుడుకులు ఎదుర్కొనే అవకాశం ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో బాంకీపూర్ ఉప ఎన్నిక ప్రముఖ నేతలకు టెన్షన్ గా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# డబ్బు గుంజేందుకే నా పరువు తీశారు: పంజాబ్ కింగ్స్ ప్లేయర్

## తప్పుడు ఎఫ్ఐఆర్‌తో తనను బ్లాక్‌మెయిల్ చేశారన్న శశాంక్ సింగ్

## డబ్బు గుంజడానికే పరువు తీసే కుట్ర జరిగిందని ఆరోపణ

## పనిలో పెట్టుకున్న వ్యక్తికి 9 కేసుల నేర చరిత్ర ఉందని వెల్లడి

## మా వాదన వినకుండానే కేసు నమోదు చేశారంటూ ఆవేదన




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్ తనపై, తన కుటుంబంపై ఇటీవల నమోదైన కేసుపై తాజాగా స్పందించాడు. సెలబ్రిటీగా తనకున్న పేరును దెబ్బతీసి, డబ్బు గుంజేందుకే ఓ వ్యక్తి తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సంచలన ఆరోపణలు చేశాడు. తనపై దాడి జరిగిందంటూ ఓ వంట మనిషి పెట్టిన కేసు పూర్తిగా కట్టుకథ అని, ఇది పరువు తీసి డబ్బు రాబట్టేందుకు పన్నిన కుట్ర అని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా వివరించాడు.గత నెలలో భోపాల్‌లోని తమ నివాసంలో పనిచేసే వంట మనిషిపై దాడి చేసి, ఫోన్ లాక్కున్నారని శశాంక్ సింగ్, ఆయన తండ్రి, రిటైర్డ్ స్పెషల్ డీజీపీ శైలేష్ సింగ్‌పై రతిబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను శశాంక్ పూర్తిగా ఖండించాడు. "నిజానిజాలు తెలుసుకోకుండా వేలమంది నన్ను దూషించారు. ఒక నిరుపేదను కొట్టిన వ్యక్తిగా నన్ను చిత్రీకరించారు. ఈ ఘటన నన్ను మార్చేసింది, జీవితాంతం గుర్తుంచుకునే పాఠాలు నేర్పింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.తమ వద్ద పనికి చేరిన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండేదని, ఇంట్లో తిరుగుతూ ఫొటోలు తీసి ఇతరులకు పంపేవాడని శశాంక్ తెలిపాడు. దీంతో మూడో రోజే అతడిని పనిలో నుంచి పంపించేశామని, అప్పుడు అతను ఆరోగ్యంగానే వెళ్లాడని స్పష్టం చేశాడు. "ఆ తర్వాత అతడు తీవ్రంగా గాయపడినట్లు వీడియోలో చూసి మేం షాక్ అయ్యాం. పోలీసు రికార్డుల ప్రకారం అతనిపై అప్పటికే హత్యాయత్నం, గృహ చౌర్యం, దాడి, బెదిరింపులు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసులు సహా మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయి. తన గుర్తింపును దాచుకోవడానికి మూడు వేర్వేరు పేర్లు వాడుతున్నాడు" అని శశాంక్ వెల్లడించాడు.ఒక తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా తనపై ఒత్తిడి తెచ్చి, డబ్బు రాబట్టుకోవాలన్నదే అతని ప్రణాళిక అని తాను నమ్ముతున్నానని శశాంక్ పేర్కొన్నాడు. "సాధారణ బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే ఇబ్బంది పడుతుంటే, మా వైపు వాదన వినకుండానే ఇంత వేగంగా కేసు ఎలా నమోదు చేశారని ఆశ్చర్యపోయాను" అని అన్నాడు. ఏప్రిల్ 30న కూడా తాను ఇలాంటి పనే చేశానని వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. ఆ రోజు తాను ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్నానని, కనీస నిజ నిర్ధారణ లేకుండా వార్తలు రాసి పరువు తీస్తున్నారని విమర్శించాడు.ఈ అనుభవంతో కొన్ని కఠినమైన పాఠాలు నేర్చుకున్నానని చెబుతూ, ప్రజలకు శశాంక్ ఒక ముఖ్యమైన సూచన చేశాడు. "ఇంట్లో పనిచేసే వారిని నియమించుకునే ముందు రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా, పూర్తి పోలీసు వెరిఫికేషన్ తర్వాతే తీసుకోవాలి. జాలి అనేది ఇంగితజ్ఞానాన్ని భర్తీ చేయకూడదు. సత్యానికి సమయం పట్టినా, చివరికి అదే గెలుస్తుంది" అని చెప్పుకొచ్చాడు.

# భారత జట్టులో భారీ మార్పులు.. గంభీర్ నమ్మిన బంటులపై వరుసగా వేటు?





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు ఓటముల పరంపర కొనసాగుతున్న వేళ తెరవెనుక మరో పెద్ద సంక్షోభం స్టార్ట్ అయింది. ఐర్లాండ్ చేతిలో 2--0తో, ఇంగ్లాండ్ చేతిలో 4--0 తేడాతో టీ20 సిరీస్‌లను ఘోరంగా ఓడిపోవడంతో.. ఇండియా కోచింగ్ స్టాఫ్‌లో అనిశ్చితి నెలకొంది. జట్టు ప్రదర్శనపై బీసీసీఐ త్వరలోనే రివ్యూ మీటింగ్ నిర్వహించనుండగా, ఆలోపే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బిగ్ షాక్ తగిలింది. గంభీర్ కి ఎంతో నమ్మకంగా జట్టులోకి తీసుకున్న సపోర్ట్ స్టాఫ్?లోని ఇద్దరు తప్పుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుత ఇంగ్లాండ్ టూర్ ముగిసిన వెంటనే అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్కాట్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ భారత్‌ను వీడబోతున్నట్లు తెలుస్తుంది.

**భారత్‌ని వీడి ఐపీఎల్‌లోకి:**

గత 2024లో గౌతమ్ గంభీర్ భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు, ఈ ఇద్దరు కోచ్‌లు జట్టులో జాయిన్ అయ్యారు. ఇండియన్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలను బలోపేతం చేయడం కోసం గంభీర్ స్వయంగా వీరిద్దరిని తుది జట్టులోకి తీసుకున్నాడు. కానీ, ర్యాన్ టెన్ డోస్కాట్ టీమిండియాతో కొనసాగడానికి అంతగా ఇంట్రెస్ట్ చూపించలేదు.. ఏడాది పాటు జట్టుతో కలిసి ప్రయాణించిన తనకు ఇబ్బందిగా మారిందని ఆయన బీసీసీఐకి తెలిపినట్లు టాక్. దీనికి తోడు ఆయన ఒక ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీతో కోచింగ్ పదవి కోసం చర్చలు జరుపుతున్నట్లు వార్త కథనాలు నడుస్తున్నాయి. మరోవైపు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా వన్డే సిరీస్ ముగిసిన తర్వాత తన భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

**జింబాబ్వే టూర్‌కు గంభీర్ ఔట్:**

ఇంగ్లండ్ టూర్ ముగిసిన వెంటనే ఇండియన్ టీమ్ జూలై 2026 చివరి వారంలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడ జింబాబ్వేతో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. జూలై 23న మొదటి టీ20, జూలై 25న రెండో మ్యాచ్, జూలై 26న మూడో మ్యాచ్ జరగనున్నాయి. కానీ, ఈ జింబాబ్వే పర్యటనకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ని బీసీసీఐ తప్పించింది. అతడికి రెస్ట్ ఇవ్వాలని బోర్డు భావిస్తోంది. గంభీర్ స్థానంలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టూర్ కి తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.

**శ్రీలంక టూర్ కి కొత్త బౌలింగ్ కోచ్:**

ఒకవేళ మోర్నీ మోర్కెల్, ర్యాన్ టెన్ డోస్కాట్ ఇద్దరూ జట్టు నుంచి తప్పుకోవాలని ఫిక్స్ అయితే, బీసీసీఐ చాలా వేగంగా స్పందించాల్సి ఉంది. ఎందుకంటే ఆ వెంటనే శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లబోతుంది. ఆగస్టు 2026లో జరగబోయే ఈ శ్రీలంక టూర్ లో ఇండియా రెండు టెస్టుల సిరీస్ ఆడబోతుంది. ఆగస్టు 15వ తేదీన గాలే వేదికగా మొదటి టెస్ట్, ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబో వేదికగా రెండో టెస్ట్ జరగనున్నాయి. మోర్కెల్ లేకపోతే, ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న టీమిండియా మాజీ పేసర్ లక్ష్మీపతి బాలాజీని శ్రీలంక టూర్‌కు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా పంపడానికి బీసీసీఐ యోచిస్తుంది.

**ఫీల్డింగ్ కోచ్ టీ.దిలీప్‌పైనా వేటు?**

భారత్ వరుస పరాజయాలతో కేవలం అసిస్టెంట్, బౌలింగ్ కోచ్‌లు మాత్రమే కాదు, ఫీల్డింగ్ కోచ్ దిలీప్ పోస్టుపై కూడా కత్తి వేలాడుతుంది. గత కొంతకాలంగా ఇండియన్ టీమ్ ఫీల్డింగ్ ప్రమాణాలు భారీగా పడిపోవడంతో.. బోర్డు ఆయనపై కూడా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద గంభీర్ కోచింగ్ టీమ్‌లోని సభ్యులు తప్పుకోవడానికి రెడీ కావడం, మరికొందరిపై బీసీసీఐ వేటు వేసేందుకు సిద్ధమైంది. రాబోయే రోజుల్లో టీమిండియా సపోర్ట్ స్టాఫ్ పూర్తిగా మారిపోయే ఛాన్స్ కనిపిస్తున్నాయి.

# 230 కోట్ల ఆస్తిపరుడైనా సాధారణ జీవితం!



నాభా నటేష్ 'గోల్డెన్ అవర్' గ్లామర్ - కెరీర్, అరంగేట్రం రాబోయే చిత్రాలు



కోలీవుడ్ అత్యంత ప్రతిభావంతులైన నటులలో ధనుష్ ఒకరు. నటుడిగా, గాయకుడిగా, గీత రచయితగా, దర్శకుడిగా , నిర్మాతగా పరిశ్రమలో తనదైన ముద్ర వేసారు. కెరీర్ ఆరంభం నుండి గ్లోబల్ స్టార్ స్థాయి వరకు ఆయన ఎదిగిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకం. అంతేనా 230 కోట్ల రూపాయల ఆస్తిపరుడు. విలాసవంతమైన జీవనశైలి తో పాటు అత్యంత సంపన్న నటులలో ఒకరిగానూ నిలుస్తున్నారు. ధనుష్ ఆస్తుల విషయానికి వస్తే ఆయనకు చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన పోయెస్ గార్డెన్‌లో 150 కోట్ల రూపాయల విలువైన బంగ్లా ప్రధానాకర్షణగా నిలుస్తుంది. అత్యంత భద్రత .. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ భవనం నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఒకటి. అంతే కాదు అళ్వార్‌పేట ప్రాంతంలో 18 కోట్ల రూపాయల విలువైన మరొక లగ్జరీ బంగ్లా కూడా ఉంది. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు ఆయన ఆర్థిక భవిష్యత్తుపై ఉన్న దూరదృష్టిని తెలియజేస్తున్నాయి. వాహనాల విషయానికి వస్తే ధనుష్‌కు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. సేకరణలో రోల్స్ రాయిస్ ఘోస్ట్, రోల్స్ రాయిస్ స్పెక్టర్ , బెంట్లీ కాంటినెంటల్ జిటి , ఫోర్డ్ ముస్టాంగ్ వంటి అత్యంత ఖరీదైన వేగవంతమైన వాహనాలున్నాయి. 7.5 కోట్ల రూపాయల విలువైన రోల్స్ రాయిస్ స్పెక్టర్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను ఇటీవల కొనుగోలు చేసారు. ఆధునిక సాంకేతికత .. విలాసం పట్ల ఆసక్తిని చాటి చెబుతోంది. ధనుష్ ఒక్కో చిత్రానికి 20 నుంచి 35 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటారు. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా కూడా భారీగా ఆర్జిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 3 కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని పొందుతుంటారని అంచనా. అంతర్జాతీయ చిత్రాల్లో నటించడం, సొంత నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిలిమ్స్ ద్వారా చిత్రాలను నిర్మించడం వంటివి ధనుష్ ఆర్థిక మూలాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.అంతటి సంపద, విలాసాలు ఉన్నా? ధనుష్ వ్యక్తిగతంగా చాలా సాధారణంగా ఉంటుంది. బయటకు వెళ్లాలంటే పలానా బ్రాండ్ కారు ఉండాలని లేదు. ఆ సమయానికి ఏది అందుబాటులో ఉంటే అందులో వెళ్లిపోతారు. షూటింగ్ సమయంలో ఎలాంటి పరిస్థితులున్నా? సర్దుకుపోవడం ధనుష్ ప్రత్యేకతగా చెబుతున్నారు. అలాగే పనిపై చూపే నిబద్ధత ..క్రమశిక్షణే ధనుష్ ని ఈ స్థాయికి చేర్చాయి. దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్నా? ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటారు. ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తనను తాను మలచుకోవడం ధనుష్ ప్రత్యేకత. ఆస్తులు ఎంతటివైనా? తన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల మనసుల్లో ఆయన సంపాదించుకున్న గుర్తింపు అన్నిటికంటే మిన్న. ఆర్థికంగా ఎంత ఎదిగినా? కళాత్మక విలువలను వదులుకోకుండా, నటుడిగా , దర్శకుడిగా కొత్త శిఖరాలను అధిరోహించడం ధనుష్ గొప్పతనం.



స్టైలిష్ ఫోటోషూట్ లుక్‌లో ఐశ్వర్య రాజేష్ ఆకర్షణీయమైన రూపం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com